సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 4-7-2025 15/-



# ఈరాన్ ఒంటరి పోరు






పవిత్ర భావాల సొబగు

# గీటురాయి

వారపత్రిక

**GEETURAI WEEKLY**

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

**Our Bank A/c Details:**
Geeturai Weekly, A/c No.1042789768
IFSC : CBIN0282407, Central Bank of India
Noor Khan Bazar Branch, Hyderabad

సంపుటి: 47 సంచిక: 26 హైదరాబాద్
శుక్రవారం 4 జులై 2025 రూ.15-00
8 ముహర్రమ్ 1447 హిజ్రీ


**తొలిగీటు**

**నిగ్రహం, సౌశీల్యం, సంతులిత వైఖరి దైవదౌత్యంలో ఒక భాగం.**

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)


**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**


**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**


28

## లోపల...


| | | |
|---|---|---|
| న్యూయార్క్‌లో భారత తేజం | ...... | 04 |
| ఈరాన్ ఒంటరి పోరు | ...... | 05 |
| మహనీయ జుబైర్ బిన్ అవామ్ (రజి) – 1 | ...... | 08 |
| చరితార్థులు–2 : షరీఫా హమీద్ అలీ | ...... | 11 |
| ముహర్రమ్ శుభాలు | ...... | 12 |
| ఈరాన్‌పై అమెరికా ప్రత్యక్ష దాడి... | ...... | 14 |
| ఈరాన్ గుండెను చీల్చిన గూఢచారి... | ...... | 16 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు (సహీహ్ బుఖారీ అనువాదం) | ...... | 19 |
| ఇస్లామ్ విశ్వాస వ్యవస్థ – 2 | ...... | 20 |
| వైద్యం – సేవా ప్రధానం కావాలి! | ...... | 22 |
| ఇస్లామ్‌లో క్షమాపణకు ఉన్న ప్రాధాన్యత | ...... | 24 |
| పరివర్తనతోనే ప్రగతి సాధ్యం | ...... | 26 |
| విద్యతోనే భవిత | ...... | 30 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |
| సత్కార్యంతోనే సాఫల్యం | ...... | 34 |


**కంపు కొడుతున్న ట్రంపు ...**



ట్రంపు మామ జోక్యంతో
ముగిసినదట యుద్ధం
అందితే జుట్టు లేకుంటే
కాళ్ళయినా సరే సిద్ధం!
కావాలంట మనోడికి
శాంతిదూత బిరుదు
ఖామెనయీ సార్ దెబ్బకు
వాసినదంట పిరుదు!!

– యం.డి. ఉస్మాన్ ఖాన్

## ఆలోచన

# న్యూయార్క్‌లో భారత తేజం

**న్యూయార్క్ నగర మేయరుగా** డెమొక్రటిక్ పార్టీ తరఫున అభ్యర్థిగా జొహ్రాన్ మందానీ పేరు ఖరారయ్యింది. జొహ్రాన్ మందానీ భారత మూల సంతతికి చెందినవారు. న్యూయార్క్ నగర మేయర్ పదవి అనేది చాలా కీలకమైన పదవి. విచిత్రమేమిటంటే, మన మీడియాలో ఈ చర్చ పెద్దగా జరగనే లేదు.

మందానీ తన ప్రచారంలో దక్షిణాసియాకు చెందిన ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నాలు ఎక్కువగా చేశారు. ఆయన ప్రచారంలో ఉర్దూ, హిందీ భాషలు, బాలీవుడ్ ప్రచార సామగ్రి కనిపించాయి. ప్రముఖ ఫిల్మ్ మేకర్ మీరానాయర్ కుమారుడు కావడం కూడా దానికి కారణం కావచ్చు. తండ్రి పేరు మహ్మూద్ మందానీ.

ఎందుకని మందానీ గురించి చర్చ భారత మీడియాలో జరగలేదు? అతను ముస్లిం కావడం వల్లనే అని కొందరి అభిప్రాయం. ఎందుకంటే ప్రీతిపాటిల్, తులసి గబ్బార్డ్, రిషి సునాక్ తదితరుల విషయంలో భారత మీడియాలో జరిగిన చర్చతో పోల్చితే న్యూయార్క్ వంటి మహానగరానికి మేయరు కాబోతున్న వ్యక్తి గురించి అస్సలు పట్టించుకోక పోవడం కాస్త విచిత్రమే.

గత కొంతకాలంగా పరిస్థితులు చాలా మారాయి. భారతదేశంలో సమాచార హక్కు చట్టం 2005లో వచ్చినప్పుడు ప్రపంచ దేశాలు మన నుంచి నేర్చుకోడానికి ఉత్సాహపడ్డాయి. కాని ఇప్పుడు అలాంటి పరిస్థితి కనబడడం లేదు.

అమెరికా రాజకీయాల్లో భారతీయులను, దక్షిణాసియా వారిని ప్రోత్సహించడానికి ఏర్పడిన ఇండియా ఇంపాక్ట్ ఫండ్ జొహ్రాన్ మందానీకి మద్దతిచ్చింది. కానీ... ఇండియన్ అమెరికన్స్ ఫర్ కుమో, అమెరికన్ హిందూ కోయలిషన్ సంస్థలు మందానీని వ్యతిరేకించాయి.

ఏది ఏమైనా, న్యూయార్క్ మాజీ గవర్నర్ ఆండ్రూ కూమో కన్నా జొహ్రాన్ మందానీ ముందంజలో ఉండి న్యూయార్క్ మేయర్ పదవికి మార్గం సుగమం చేసుకున్నాడు.

జొహ్రాన్ మందానీ బాహాటంగా పాలస్తీనాకు మద్దతిచ్చిన వాడు. గాజాపై ఇస్రాయిల్ దాడిని నరసంహారం అని తీవ్రంగా విమర్శించాడు. అంతేకాదు, న్యూయార్క్‌కు నెతన్యాహు వస్తే అరెస్టు చేయాలన్నాడు. అలాంటి మందానీ విజయం సాధించడం చూస్తే అమెరికా ప్రజల్లో పాలస్తీనా పట్ల సంఘీభావం, సానుభూతి పెరుగుతున్నాయని అర్థమవుతుంది. అంతేకాదు, మందానీ వామపక్ష భావాలున్న వ్యక్తి అన్నది కూడా అందరికీ తెలుసు. అమెరికా రాజకీయాల్లో ఇప్పుడు ఇది కొత్త మలుపుగా మారవచ్చని మరి కొందరి అభిప్రాయం. ముఖ్యంగా యువ ఓటర్లు ఆయన పక్షాన నిలిచారు. ఇస్రాయిల్ రాజకీయాలను మందానీ తీవ్రంగా విమర్శించడమే యువ ఓటర్లను ఆకర్షించిందని కొందరి వాదన. ఇస్రాయిల్‌ను విమర్శిస్తే అమెరికా రాజకీయాల్లో నిలబడడం కష్టమనే వాతావరణం దట్టంగా అలుముకుని ఉన్నప్పటికీ నిర్భయంగా ఇస్రాయిల్‌ను తీవ్రంగా విమర్శించి తన ప్రత్యేకతను చాటుకున్నాడు మందానీ.

ఇస్రాయిల్ పట్ల మందానీ ప్రకటించిన అభిప్రాయాలను రాజకీయాలకు వాడుకుని ఆయన్ను దెబ్బతీయాలని ప్రత్యర్థి కుమో ప్రయత్నించాడు. మందానీ వ్యాఖ్యలను అమెరికన్ యూదులపై దాడిగా చిత్రీకరించడానికి ప్రయత్నించాడు. కాని ఓటర్లు ఈ వాదనలన్నింటినీ తిరస్కరించారు. నిజానికి అమెరికన్లలో ముఖ్యంగా న్యూయార్కులో ఇస్రాయిల్ రాజకీయాల పట్ల ఏవగింపు కనిపిస్తుందిప్పుడు.

న్యూయార్క్ డెమొక్రాట్లకు కంచుకోట. డెమొక్రాట్ అభ్యర్థిగా ఖరారైన మందానీ న్యూయార్కు మేయర్ ఎన్నికల్లో గెలుపు సాధించడం ఇక లాంఛనం మాత్రమే. మరో భారత సంతతికి చెందిన వ్యక్తి ప్రపంచ పటంలో భారత తేజాన్ని చాటి చెబుతున్నాడు.

**కవరు కథనం**

అబ్దుల్ వాహెద్



# ఈరాన్ ఒంటరి పోరు

**మరోసారి ట్రంప్** తాను యుద్ధ విరమణ చేయించానన్నాడు. కాని ఈ సారి ఆయన ప్రకటన వచ్చిన వెంటనే అటు వైపు నుంచి ఖండన వచ్చింది. అమెరికాతో వ్యాపారం ప్రలోభంకాని, అమెరికా ఆంక్షల భయంకాని పనిచేయలేదు. ట్రంప్ చేసిందేమీలేదు, ఖతర్ ప్రయత్నాల వల్లనే యుద్ధం ఆగిందంటూ ఈరాన్ నుంచి ప్రకటన వచ్చింది.

ఈరాన్, ఇస్రాయీల్ యుద్ధం ఆగింది కాబట్టి ఇప్పుడు బహుశా గాజాలో ఇస్రాయీల్ పైశాచికత్వం పత్రికల్లో కనిపించవచ్చు. వెస్ట్ బ్యాంకులో అరబ్బు గ్రామాలను నాశనం చేసిన వైనం చర్చలకు రావచ్చు.

ఈరాన్ ఇస్రాయీల్‌లు యుద్ధంలో ఎవరికి వారు తమదే విజయం అని చెప్పుకోవడం మొదలైపోయింది. ఈరాన్ న్యూక్లియర్ స్థావరాలన్నీ నాశనం చేసేశానని ట్రంప్ చెప్పుకుంటున్నాడు. కాని అమెరికా అనవసరంగా ఈ యుద్ధంలో దూకి, భారీ బాంబులేసినా అనుకున్నది సాధించలేదన్న వార్తలు ప్రముఖంగా వచ్చాయి. ఈరాన్‌లో అణుస్థావరాలపై చేసిన దాడి విఫలమైందన్న వార్తలే కాదు, ఘనత వహించిన అమెరికా వారి అరివీర భయంకర బాంబర్ విమానాన్ని కూడా ఈరాన్ నేలకూల్చిందన్న వార్తలు కూడా వచ్చాయి. ఈ వార్తలు అమెరికాలో ఆయుధ పరిశ్రమకు గొడ్డలిపెట్టు. అయినా ట్రంప్ తానే యుద్ధాన్ని ఆపానని చెప్పుకోవడం ఆగదు. ఆయనకు నోబెల్ దొరుకుతుందో లేదో తెలియదు.

ఇస్రాయీల్ ప్రధాని నెతన్యాహు కూడా విజయం తమదే అని చెప్పుకుంటున్నాడు. హిజ్బుల్లాను అణిచేశానని, ఈరాన్ పై దాడి చేసి సైన్యాధికారులను, అణుశాస్త్రవేత్తలను తుదముట్టించానని, అమెరికా ఈరాన్‌పై దాడి చేసేలా నచ్చచెప్పి ఈరాన్ మళ్ళీ అణుశక్తి కోసం ప్రయత్నించే అవకాశం లేకుండా చేసి ఇస్రాయీల్‌ను కాపాడేశానని చెప్పుకుంటున్నాడు. నిజానికి ఇస్రాయీల్ గాజాపై చేస్తున్న యుద్ధంలో సాధించింది ఏమీ లేదు, అమాయక ప్రజలను చంపడం తప్ప. ఈరాన్‌పై చేసిన యుద్ధంలో ఇస్రాయీల్ చావు తప్పి కన్నులొట్టపోయిందని ఇప్పుడు వార్తలు వస్తున్నాయి. అయినా నెతన్యాహు తనదే విజయం అని చెప్పుకుంటాడు.

ఈరాన్ కూడా విజయం తమదే అని చెప్పుకుంటుంది.

ఇజ్రాయిల్ ప్రధాన నగరాల్లో ఈరాన్ మిస్సయిళ్ళు విధ్వంసం సృష్టించాయి. ఈరాన్ సైనికస్థావరాలు, మొస్సాద్ ప్రధాన కార్యాలయం, వాణిజ్య భవన సముదాయాలు కుప్పకూలాయి. ఇజ్రాయిల్ బెంబేలెత్తిపోయేలా చేశానని ఈరాన్ చెప్పుకుంటోంది. అంతేకాదు, మధ్యప్రాచ్యంలో అమెరికా సైనికస్థావరాలపై క్షిపణి దాడులు చేసి అమెరికా వెన్నులో చలి పుట్టించానని చెప్పుకుంటోంది. అంతేకాదు, లక్షలాది మంది ఈరానీయులు రోడ్ల మీదకు వచ్చి విజయ సంబరాలు జరుపుకున్నారు. రాత్రికి రాత్రే ఈరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖామనేయి 'హీరో' అయిపోయారు. ఎనభై ఆరేళ్ళ ఆ పెద్దాయన ముఖారవిందం తౌజెండ్ కాండిల్ బల్బులా వెలిగిపోయింది. ఏది ఏమయినా వార్ధక్యంలో ఇంతటి శౌర్యాన్ని, తెగువను ప్రదర్శించిన అలీ ఖామనేయి బహుదా ప్రశంసనీయుడు.

కాస్త నిశితంగా చూస్తే ఈ యుద్ధంలో, దీర్ఘకాలిక ప్రయోజనాలు ఈరాన్‌కే లభించాయన్నది స్పష్టం. శత్రుభయంకరమైన ఈరాన్ మిస్సయిళ్ళ సామర్థ్యాన్ని ప్రపంచం చూసింది. సాంప్రదాయిక యుద్ధాల స్వరూపాన్ని ఈరాన్ మార్చేసింది. అత్యంత ఖరీదైన యుద్ధవిమానాలకు బదులు, వాటికన్నా చాలా చవగ్గా తయారు చేసుకున్న మిస్సయిళ్ళతో శత్రు గగనతలాన్ని శాసించడం ఎలాగో ఈరాన్ చూపించింది. ప్రపంచ మార్కెటులో ఇప్పుడు ఈరాన్ మిస్సయిళ్ళ గిరాకీ పెరగవచ్చు. మరోవైపు ఈరాన్ అంతర్జాతీయ అణు సంస్థతో సంబంధాలు తెగతెంపులు చేసుకుంటున్నట్లు ప్రకటించింది. కాబట్టి ఇక ఈరాన్ అణుకార్యక్రమాలపై నిఘా అనేది ఉండదు. ఇప్పుడు ఈరాన్‌పై ఒత్తిడి తీసుకువచ్చి అంతర్జాతీయ నిఘా కొనసాగించే పరిస్థితి కూడా మిగల్లేదు. మరోవైపు రష్యా, చైనా, ఉత్తర కొరియా దేశాలు ఈరాన్‌కు పరమాణు బాంబులిస్తామని ప్రకటించడం ఈ యుద్ధంలో కీలక పరిణామం. రష్యా తన ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ యస్. 400, యస్. 500 కూడా ఇవ్వడానికి సిద్ధపడింది. అంటే ఈ యుద్ధం తర్వాత ఈరాన్ న్యూక్లియర్ పవర్‌గా మారే అవకాశాలు పెరిగాయి.

ఈ మొత్తం యుద్ధంలో గమనించదగిన సంఘటన సిరియాలోని అమెరికా సైనిక స్థావరంపై ఈరాన్ చేసిన దాడి. ఈ దాడి నిజానికి అమెరికాను దెబ్బతీయడానికి చేసిన దాడి కాదు. అమెరికాపై దాడి చేయగలమని చెప్పడానికి చేసిన దాడి. ఈ దాడి గురించి ముందుగానే సిరియాకు సమాచారం ఇచ్చారు. అమెరికా సైనికుల ప్రాణనష్టం లేకుండా జరిగిన దాడి ఇది. ఇందులో కీలకపాత్ర పోషించిన ఖతర్ అంతర్జాతీయ వ్యవహారాల్లో ఇప్పుడు పలుకుబడి పెంచుకుంది. ఖతర్‌లో ఉన్న అమెరికా స్థావరాలపై కూడా ఈరాన్ దాడి చేసింది. ఖతర్, సిరియా, సౌదీ, ఇరాక్ తదితర దేశాల్లోని అమెరికా స్థావరాలపై ఈరాన్ దాడి చేస్తే, ఈరాన్ క్షిపణులను అడ్డుకోవడం అమెరికాకు సాధ్యం కాదు. ఈ యుద్ధం కొత్త మలుపు తీసుకుంటే మధ్యప్రాచ్యంలో అమెరికా స్థావరాలు ఖాళీ చేసే పరిస్థితి రావచ్చు. మరోవైపు ఈ అరబ్బు దేశాల ప్రజలు కూడా తిరగబడవచ్చు. ఈ పరిణామాలు మధ్యప్రాచ్యాన్ని అతలాకుతలం చేస్తాయి. అమెరికా ప్రయోజనాలను దెబ్బ తీస్తాయి.

ఇప్పుడు యుద్ధ విరమణకు కారణం ఏమిటి అనేది నిశితంగా ఆలోచించవలసిన విషయం. ప్రపంచంలో అనేక దేశాలు గాజాపై దాడులు ఆపమని చెబుతున్నా లెక్కచేయని ఇజ్రాయిల్ ఇప్పుడు ఎందుకు వెంటనే ఒప్పుకుంది? కారణం స్పష్టంగా కనబడుతుంది. ఈరాన్ క్షిపణుల వానలో ఇజ్రాయిల్ ఎండుటాకులా తగలబడింది. అందువల్లనే ఈ యుద్ధ విరమణకు ఒప్పుకోక తప్పలేదు. అయినా నెతన్యాహు ఈ యుద్ధ విరమణకు కట్టుబడతాడన్న నమ్మకం లేదు. అనవసరంగా ఈ యుద్ధాన్ని ప్రారంభించడానికి కారణం నెతన్యాహు తన గద్దెను కాపాడుకోడానికి వేసిన ఎత్తుగడ. కాని ఈ యుద్ధం తర్వాత నెతన్యాహుపై తీవ్రమైన అసమ్మతి, ఆగ్రహాలు పెల్లుబుకుతున్నాయి. కాబట్టి ఈ యుద్ధ విరమణ ఎక్కువ కాలం కొనసాగడం కష్టం. అమెరికా, ఈరాన్‌ల మధ్య చర్చలు జరుగుతున్న సమయంలో అకస్మాత్తుగా ఈరాన్‌పై దాడి చేసి నెతన్యాహు నమ్మశక్యతను కోల్పోయాడు. నెతన్యాహుకు మద్దతిచ్చి ట్రంప్ కూడా మాట నిలకడ లేని మనిషయ్యాడు.

ఈరాన్‌లో ప్రభుత్వాన్ని కూల్చడానికి, ఈరాన్‌లో అంతర్యుద్ధం రెచ్చగొట్టి రెండుగా చీల్చడానికి కూడా ప్రయత్నాలు జరిగాయి. నెతన్యాహు ఈ ప్రయత్నాల గురించి గర్వంగా కూడా చెప్పుకున్నాడు. ఏది ఏమైనా అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు ఈరాన్ అణుశక్తి దేశంగా మారకుండా అడ్డుకోడానికి ఈ యుద్ధం చేశామంటున్నాయి.

ఈరాన్‌లోని ఫోర్డో, నతాంజ్, ఇస్ఫహాన్ అణుస్థావరాలపై అమెరికా 14 బంకర్ బస్టర్ బాంబులేసింది. ఎందుకంటే అక్కడ ఈరాన్ అణుబాంబులు తయారు చేసేస్తోంది కాబట్టి వాటిని ధ్వంసం చేయడానికి. నిజమా... కేవలం మూడు నెలల ముందు అమెరికా ఇంటిలిజెన్స్ డైరెక్టర్ హెూదాలో తులసీ గబ్బార్డ్ అధికారికంగా ఈరాన్ అణుబాంబులు తయారు చేసే పనిలో లేదని చెప్పింది. మరి ట్రంప్ ఈ దాడి ఎందుకు చేసినట్లు? సిఎన్ఎన్ రిపోర్టు ప్రకారం అమెరికా చేసిన దాడి వల్ల ఈరాన్ అణుసామర్థ్యం చెక్కు చెదరలేదని తెలుస్తోంది.

ఈ యుద్ధంలో ఈరాన్ తీవ్రంగా దెబ్బతిందన్నది వాస్తవం. సీనియర్ సైన్యాధికారులు మరణించారు. అణుశాస్త్రవేత్తలు మరణించారు. ఎయిర్ డిఫెన్స్ దెబ్బతింది. ఈరాన్ గగనతలాన్ని తమ అధీనంలో తీసేసుకున్నామంటూ ఇస్రాయీల్, అమెరికాలు గర్వంగా ప్రకటించే స్థాయికి వెళ్ళాయి.

కాని జూన్ 13వ తేదీన ఇస్రాయీల్ దాడిలో ఇంతగా దెబ్బతిన్నప్పటికీ వెనువెంటనే ప్రతిదాడికి ఈరాన్ సిద్ధపడడం ప్రపంచాన్ని ఆశ్చర్య పరిచింది. ఈ యుద్ధంలో ఈరాన్ 500 క్షిపణులు ప్రయోగించింది. ఈరాన్ సుప్రీం లీడర్‌ను హత్య చేస్తామన్న స్థాయికి అమెరికా వాచాలత్వం దిగజారింది. ఈ ఒత్తిళ్ళన్నింటిని ఈరాన్ తట్టుకుంది. ఇస్రాయీల్‌ను కోలుకోలేని స్థాయిలో గాయపరిచింది. ఈ యుద్ధం నిజానికి అరబ్బుపాలకులను ఇంతకన్నా ఎక్కువగా నష్టపరిచింది. సగటు అరబ్బు ప్రజల్లో ఈరాన్ పట్ల గౌరవభావం పెరిగింది. అమెరికా అడుగులకు మడుగులొత్తే తమ పాలకుల కన్నా ఈరాన్ గొప్ప అనుకునే అభిప్రాయం ఏర్పడింది.

ఈ యుద్ధాన్ని పరిశీలిస్తే ఇస్రాయీల్‌కు అమెరికా ప్రత్యక్ష మద్దతు ఇచ్చింది. సౌదీ తదితర అరబ్బు దేశాలు పరోక్షంగా మద్దతిచ్చాయి. మరోవైపు ఈరాన్‌కు మద్దతుగా నిలబడిన దేశాలేవి? రష్యా మద్దతిచ్చే స్థితిలో లేదు, ఉక్రెయిన్ యుద్ధంలో చిక్కుకు పోయింది. చైనా పరోక్ష మద్దతు మాత్రమే లభించింది. చైనా, రష్యా, ఉత్తర కొరియాల నుంచి మాట సహాయం తప్ప ప్రత్యక్ష సహాయం లభించలేదు. నిజానికి ఈరాన్ ఒంటరిగా పోరాడింది.

ఈ యుద్ధం తర్వాత వాతావరణం మారింది. అవసరమైతే అమెరికా స్థావరాలపై దాడి చేయడానికి ఇప్పుడు ఈరాన్ మాత్రమే కాదు అమెరికా పట్ల ఆగ్రహమున్న వారెవరైనా సరే వెనుకాడకపోవచ్చు. ఇస్రాయీల్ నగరాలపై దాడులు చేయడానికి కూడా ఎవ్వరూ ఇప్పుడు భయపడరు. ఇస్రాయీల్ ఐరన్ డోమ్ డొల్లతనం బట్టబయలైంది. ఇస్రాయీల్ ఒత్తిడితో ఈరాన్‌పై అమెరికా చేసిన దాడి తర్వాత అమెరికా యుద్ధ విమానాల సామర్థ్యంపై అనుమానాలు పెరిగాయి.

గాజాలో బంధీలుగా ఉన్న ఇస్రాయీల్ పౌరులను విడిపించడంలో నెతన్యాహు విఫలమయ్యాడు. ఈరాన్ అణుసామర్థ్యాన్ని దెబ్బతీయలేక పోయాడు. యుద్ధాల ద్వారా తన అధికారాన్ని కాపాడుకుంటూ వచ్చిన నెతన్యాహు అధికారానికి బహుశా ఈ యుద్ధం చరమగీతం పాడే సూచనలున్నాయి.

ఈరాన్ చూపించిన రాజీలేని వైఖరి, అమెరికా ఒత్తిడికి తలొంచని నిర్భీతి ప్రపంచ దేశాలను ఆకట్టుకున్నాయంటే అందులో ఎలాంటి సందేహం లేదు. ✤


యువతరానికి
విప్లవనాదం
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు !

చందా వివరాలు

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి
గీటురాయి వారపత్రికను
తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
GEETURAI WEEKLY
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా
పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే
డి.డి.ని 'Geeturai Weekly'
పేర మాత్రమే తీయాలి.

GEETURAI WEEKLY
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com




# భువిలోనే దివి శుభవార్త పొందిన మహనీయులు

# మహనీయ జుబైర్ బిన్ అవామ్ (రజి)

6/1

**ఎస్.ఎమ్. మలిక్**

## మహనీయ జుబైర్ బిన్ అవామ్

మహనీయ జుబైర్ బిన్ అవామ్(ర) కూడా మహనీయ అబూ బక్ర్(ర) ద్వారా ఇస్లామ్ సందేశాన్ని గ్రహించి ఆయన చేతి మీదుగా సత్య ధర్మాన్ని స్వీకరించిన వారే. ఈయన విశ్వాసుల మాతృమూర్తి మహనీయ ఖదీజా(ర) సోదర సుతులు. ప్రవక్తశ్రీ (స) సొంత మేనత్త సఫియ్యా(ర) ఆయనకు తల్లి అవుతారు. ఆ విధంగా ఆయన ప్రవక్త మహనీయులకు మేనత్త కొడుకు అవుతారు. ఈయన ఇస్లామ్ స్వీకరించినప్పుడు వయసు 16 సంవత్సరాలు.

## దైవ మార్గంలో పరీక్షలు

మహనీయ జుబైర్(ర) బాబాయి నౌఫల్‌కు తెలిసింది జుబైర్, తాత ముత్తాతల ధర్మాన్ని వదలి ప్రవక్త ముహమ్మద్(స) ధర్మాన్ని స్వీకరించారని. ఆయన్ని తిరిగి బహు దైవారాధన వైపునకు మరలించడానికి హింసా దౌర్జన్యాలకు పాల్పడ్డాడు నౌఫల్. అతను హింసాకాండలో భాగంగా మహనీయ జుబైర్(ర)ని చాపలో చుట్టి వ్రేలాడ దీసేవాడు, ఇంకా బాధ కలిగించడానికి క్రింద పొగ పెట్టేవాడు. అత్యంత బాధాకరమయిన ఈ శిక్షను భరించలేక ఆయన పెడ బొబ్బలు పెట్టేవారు, ఆ బాధలోనే, "నన్ను చంపివేసినాసరే నేను ముహమ్మద్(స) ధర్మాన్ని వదలి పెట్టను" అని కేకలు వేసేవారు.

కురైష్ తెగలన్నీ ఇదే వైఖరి నవలంబించేవారు. తమ తెగలో ఎవరయినా ఇస్లామ్ స్వీకరించినట్లు తెలిస్తే వారి పైన ఎనలేని హింసలు ప్రయోగించేవారు. ఈ విధంగా వారిని సత్య ధర్మం నుంచి తొలిగించగలమని భావించేవారు. వారి దౌర్జన్యాలు, హింసాకాండ సహింపరానిదయి పోయినప్పుడు వారిని రభస చేయకుండా అబీసీనియాకు వెళ్ళిపొమ్మని సలహా ఇచ్చారు దైవ సందేశహరులు(స). ఈ అనుమతి పొందిన తరువాత హిజ్రీ 5వ సంవత్సరం పదకొండు మంది పురుషులు, నలుగురు స్త్రీల బృందం దాక్కుంటూ దాక్కుంటూ అబీసీనియా చేరింది. అందులో ఈ ఇరవై ఏళ్ళ యువకుడు మహనీయ జుబైర్ కూడా ఉన్నారు.

## రెండు హిజ్రత్‌లు

ఒక నెల కడచిన తరువాత మక్కా బహుదైవారాధకులు ముస్లిములయి పోయారన్న తప్పుడు సమాచారం అబీసీనియాకు వలస వెళ్ళిన ముస్లిములకు అంది, వారిలో కొందరు

తిరిగి మక్కా వచ్చేశారు. వారితోపాటు మహనీయ జుబైర్ కూడా వచ్చారు. వాస్తవానికి ఈ అపోహ కలగటానికి కారణం ఒక సంఘటన. ఒక రోజు ప్రవక్తశ్రీ(స) కాబా ప్రాంగణంలో ముస్లిములు, తిరస్కారుల సమూహం మధ్యన అన్ నజ్మ్ సూరా వినిపించారు. అందులో చివరన సజ్దా ఆయత్ ఉండటం మూలాన ప్రవక్తశ్రీ(స) సజ్దా చేశారు. అదేమి విచిత్రమో ప్రవక్తశ్రీ(స) తోపాటు అక్కడ ఉన్న బహుదైవారాధకులు, వారిలో ఇస్లామ్ విరోధంలో ముమ్ముందు ఉండేవారు సయితం, అప్రయత్నంగా సజ్దా చేస్తూ మోకరిల్లారు. ఈ సంఘటన వల్ల మక్కా బహుదైవారాధకులు ముస్లిముల య్యారు అనే అపోహ కలిగి అదే సమాచారం బహుళ ప్రచారం పొందింది.

హిజ్రీ 13వ సంవత్సరం దైవ సందేశహరులు(స) మదీనాకు హిజ్రత్ చేసినప్పుడు మహనీయ జుబైర్ తన వ్యాపారం నిమిత్తం సిరియా వెళ్ళి ఉన్నారు. ఈ సందర్భంలో ఒక ఉల్లే ఖనం ఆయన తనయుడు ఉర్వా ద్వారా ప్రోక్తమయినది లభిస్తుంది. దాని ప్రకారం ఆయన తిరిగి వస్తూ ఉండగా హిజ్రత్ చేస్తున్న ప్రవక్తశ్రీ(స) దారిలో కలిశారు. అప్పుడు మహనీయ జుబైర్(ర) తన సరకులో నుంచి తెల్ల దుస్తులు రెండు తీసి ప్రవక్తశ్రీ(స)కి, మహనీయ అబూ బక్ర్(ర)కు తొడిగిస్తారు.

ఆ పైన మహనీయ జుబైర్(ర) మక్కా చేరి మదీనా వెళ్ళేం దుకు సన్నద్ధమవసాగారు. బహుశా ఆయన నలభై మంది ముస్లి ములు హిజ్రత్ చేసిన తరువాత హిజ్రత్ చేసే ఎనిమిదవ బృందంలో చేరారు. అందులో ఆయనతోపాటు ఆయన తల్లి మహనీయ సఫియ్యా, భార్య మహనీయ అస్మా, (మహనీయ అబూ బక్ర్ కూతురు) కూడా ఉన్నారు. వారు మదీనా చేరి కుబాలో బస చేశారు. అప్పుడు మహనీయ అస్మా గర్భవతి. మదీనా చేరిన తరువాత ఆమెకు బాబు పుట్టాడు. మహనీయ అస్మా(ర) ఆ బాబును ప్రవక్తశ్రీ(స) వద్దకు తీసుకు వెళ్ళారు. ఆయన(స) బాబును ఒడిలో తీసుకుని తన లాలాజలాన్ని అతని నోట్లో పోశారు. హిజ్రత్ తరువాత ముస్లిముల ఇంట పుట్టిన వారిలో ఈయన మొదటి వారు. ఈయనకు అబ్దుల్లా అని పేరు పెట్టారు.

మదీనాలో మహనీయ జుబైర్ బిన్ అవామ్(ర) జీవిక కొరకు వ్యవసాయం, తోటలు పెంచడం వృత్తిగా స్వీకరించారు. ప్రవక్త మహనీయులు తనకు లభించిన ఖర్జూరపు తోటల్లో ఒకటి మహనీయ జుబైర్‌కు బహూకరించారు. ఆ రోజుల్లో మహనీయ జుబైర్(ర) ఆస్తిలో ఒక ఒంటె, ఒక గుర్రం, ఈ తోట ఉండేవి. మహనీయ అస్మా తోటలో పని చేసేవారు. బహుశా కొంత కాలం తరువాత ఆయన మరో తోట కొన్నారు.

## ఇస్లామీయ ఉద్యమంలో ఆయన

మదీనాలోనూ స్థిమితంగా ఉండనివ్వలేదు మక్కా వాసులు. హిజ్రీ 2వ సంవత్సరం మదీనా పైకి దండెత్తేందుకు సమాయత్త మయ్యారని సమాచారం అందింది ప్రవక్తశ్రీ(స) కి. ఆయన (స) సహచర మాన్యులను తీసుకుని వారిని ఎదుర్కొనేందుకు బయలుదేరారు. బద్ర్ అనే చోట మకాం వేశారు. మక్కా వారి భోగట్టా తెలుసుకునేందుకు మహనీయ జుబైర్‌తో కొందరు సహచర మాన్యుల్ని ముందస్తుగా పంపారు. వారికి యాదృచ్ఛికంగా ఇద్దరు కురైషీ యువకులు దొరికారు. వారిని పట్టుకుని విచారిస్తే తమకేమీ తెలియదని చెప్పారు.

వారిని ప్రవక్తశ్రీ(స) వద్దకు తీసుకు వచ్చారు. ప్రవక్త మహనీ యులు (స) వారిని లాలనగా బుజ్జగించి అడిగారు, "ఇప్పుడు కురైష్ ఎక్కడ ఉన్నారు?" అని.

దానికి వారు, "ఎదురుగా కనిపించే గుట్టకు ఆవల ఉన్నారు" అని చెబుతారు.

తిరిగి ప్రశ్నించారు ప్రవక్తశ్రీ(స), "మొన్న మీరు ఎన్ని ఒంటెలు జిబ్హ్ చేశారు?"

"పది ఒంటెలు" అని సమాధానం ఇచ్చారు ఆ యువకులు.

"మరి నిన్న?" మళ్ళీ అడుగుతారు ఆయన(స).

"తొమ్మిది" చెబుతారు వారు.

ఈ సమాధానం విని ప్రవక్త మహనీయులు(స) మహనీయ జుబైర్ ప్రభృతుల వైపునకు తిరిగి, "బహు దైవారాధకులు వెయ్యి, తొమ్మిది వందల మధ్య ఉండవచ్చు" అని చెప్పారు ప్రవక్తశ్రీ(స).

బద్ర్ మైదానంలో మహనీయ జుబైర్ చూపిన పరాక్రమం గుర్తులు ఆయన వంటి పైన జీవితాంతం ఉండి పోయాయి. ఆయన తనయుడు ఉర్వా(ర) ఇలా చెప్పారు,

"మహనీయ జుబైర్‌కు కేవలం కరవాలం దెబ్బలే మూడు తగిలాయి. వాటిలో ఒకటి భుజాన తగిలింది. అవి ఎంత లోతుగా ఉండేవంటే వాటిలో నేను నా వ్రేళ్ళు చొనిపేవాణ్ణి. వాటిలో ఒకటి బద్ర్‌లోనూ, రెండు యర్మూక్ యుద్ధంలో తగిలాయి.

తనకూ అబ్దుల్ మలిక్ బిన్ మర్వాన్‌కు మధ్య జరిగిన సంభా షణ ఉదాహరించారు ఉర్వా(ర).

"నన్ను అబ్దుల్ మలిక్ బిన్ మర్వాన్ ఒకసారి అడిగారు, "ఉర్వా! అబ్దుల్లా బిన్ జుబైర్ అమరగతి పొందిన తరువాత జుబైర్ గారి కరవాలం ఏమయింది?.. మరి మీరు ఆ కరవాలాన్ని గుర్తు పట్టగలరా?" అని.

దానికి "నేను గుర్తు పట్టగలను" అని సమాధానం ఇచ్చాను.

ఆయన అడిగారు, "ఎలా?" అని.

నేను చెప్పాను, "దానికి బద్ర్ నాడు నొక్కులు పడ్డాయి" అని.

"నిజం చెప్పావు, అందులో కరవాలాల దెబ్బల వల్ల నొక్కులు పడ్డాయి" అని చెప్పి ఆ కరవాలం నాకు ఇచ్చివేశారు.

అక్కడ ఉన్న వారు దాని వెల మూడు వేలు కట్టి వారిలోనే ఎవరో దాన్ని తీసుకున్నారు. బద్ర్ మైదానంలో ఏం జరిగిందో స్వయంగా ఆయన నోట విందాము. ఆయన చెప్పారు:

"బద్ర్ నాడు నేను మైదానంలో ఉబైదా బిన్ సయీద్ బిన్ ఆస్‌ని ఎదుర్కొన్నాను. అతను ఆపాద మస్తకం ఉక్కు కవచం ధరించి వచ్చాడు. కేవలం కళ్ళు కనిపించేవి. అతనికి మరో పేరుంది, 'అబూ జాతిల్ కిర్ష్ (బొజ్జ వాడు)' అని. అతను ఎదురు వచ్చి, "నేను బొజ్జ వాణ్ణి, తెలుసా?" అన్నాడు. నేను చిన్న బల్లెం పుచ్చుకుని అతని కంటి గురి చూసి విసిరాను. అంతే, అతను కుప్ప కూలిపోయాడు. నేను అతని కళేబరం పైన కాలు పెట్టి బల్లెం లాగాను, అది అతి కష్టంమీద వచ్చింది. దాని రెండు కొనలూ వంగి పోయాయి. బహుశా బల్లెం తలలో లోతుగా దిగింది."

## గుర్తింపు పొందిన ఆయుధం

దాని మీదట మహనీయ ఉర్వా చెప్పిన దాని ప్రకారం, ఆ బల్లెం మహనీయ జుబైర్‌ని అడిగి ప్రవక్త(స) తీసుకున్నారు. ఆయన పరమపదించిన తరువాత మహనీయ జుబైర్ తిరిగి తీసుకున్నారు. అయితే కొన్నాళ్ళకు మహనీయ అబూ బక్ర్(ర) దాన్ని తీసుకున్నారు. ఆ తరువాత మహనీయ ఉమర్(ర) దాన్ని తీసుకున్నారు. ఆయన తరువాత అది మళ్ళీ మహనీయ జుబైర్‌కు దక్కింది. ఆ పైన మహనీయ ఉస్మాన్ (ర) దాన్ని తీసుకున్నారు. మహనీయ ఉస్మాన్ అమరగతి పొందిన తరువాత మహనీయ అలీ సంతానం దాన్ని అడిగి తీసుకున్నారు. ఆ తరువాత అబ్దుల్లా బిన్ జుబైర్ వారిని అడిగి తీసుకున్నారు, ఆయన అమరగతి వరకు అది ఆయన వద్దనే ఉండేది, ఆ తరువాత దాని జాడ లేదు.

ప్రవక్త మహనీయుల(స) కాలంలో చిత్తశుద్ధి, శౌర్యం, పోరాట పటిమ, ప్రాణ త్యాగం వంటి ధైర్య సాహసాల అసంఖ్యాక సంఘటనలు సహచర మాన్యులు ప్రదర్శించారు. వాటిని చదివి నేడు ఎవరయినా అచ్చెరువు చెందుతారు. అయితే మహనీయ జుబైర్(ర) బద్ర్ నాడు చేసిన మహత్కార్యాన్ని స్వయాన ప్రవక్త(స) శ్లాఘించారు. పైగా ఇస్లామ్ యోధుల చరిత్రలో ఒకరి ఆయుధాలకు ప్రవక్త(స), సన్మార్గ గాములయిన ఖలీఫాలు, ఇతర సహచర మాన్యులు ఇంతగా ప్రాముఖ్యత ఇచ్చిన ఆధారాలు లేవు. ✤


**చందాదారులకు విజ్ఞప్తి**

చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.

**వివరాలకు సర్క్యులేషన్ మేనేజర్‌కు ఫోన్ చేయండి: 9704317015**

ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పంపినవారు ఈ నెంబరుకు **Screen Shot** పంపి **9989903850** ఫోన్ చేయండి.

**Bank Details**

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
**Hyderabad- 500 002, Telangana**

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**

## 'చరితార్థులు'-2



# షరీఫా హమీద్ అలీ

## (1883 -1971)

**86**




**ఆంగ్లేయులకు** భారతావనిలో వ్యతిరేకంగా ప్రజ్వరిల్లిన స్వాతంత్ర్య సంగ్రామంలో మూడు తరాలుగా క్రియాశీలకంగా పాల్గొం టున్న ప్రముఖ 'తయ్యబ్జీ' కుటుంబా నికి చెందిన ఆడపడుచు షరీఫా హమీద్ అలీ 1883లో గుజరాత్‌కు చెందిన వడోదరాలో జన్మించారు. ఆమె తండ్రి జస్టిస్ అబ్బాస్ తయ్యబ్జీ, తల్లి బేగం ఆమినా తయ్యబ్జీ. తల్లితండ్రులు ఇరువురు కూడా మహాత్మాగాంధీ బాటలో జాతీయోద్యమంలో ప్రముఖ పాత్ర వహించారు. ప్రగతిశీల భావా లకు ప్రతీకగా నిలచిన కుటుంబంలో జన్మించినందున ఎటువంటి ఆటం కాలు లేకుండా ఆమె ఉన్నత విద్య సాగింది. ఆమె పలు భాషలను అలవోకగా నేర్చుకున్నారు. చిన్ననాటి నుండి తయ్యబ్జీ కుటుంబాన వ్యక్తమవు తున్న బ్రిటిష్ వ్యతిరేక భావజాలాన్ని బాగా వంట పట్టించుకున్న షరీఫా హమీద్ అలీ చిన్ననాటనే జాతీయోద్యమంలో అడుగు పెట్టారు. 1907 నుండి ఆమె భారత జాతీయ కాంగ్రెస్ కార్యక్రమాలలో పాల్గొనడం ఆరం భించారు. మహాత్మాగాంధీకి తన తల్లితండ్రులు మాత్రమే కాకుండా తమ యావత్తు తయ్యబ్జి కుటుంబీకులు అను చరులు కావడంతో గాంధీజీ మార్గదర్శకత్వంలో గుజరాత్‌లో ఆరంభమైన ప్రతి కార్యక్రమంలో షరీఫా పాల్గొన్నారు. ప్రధానంగా స్వదేశీ ఉద్యమంలో ఆమె ప్రముఖ పాత్రను నిర్వహించారు. స్వదేశీ వస్తువుల వాడకం, విదేశీ వస్తువుల నిషేధం గురించి ప్రచార కార్యక్రమాలను ముమ్మరంగా సాగించారు. మద్యపాన నిషేధం, హరిజనులకు సాంఘిక న్యాయం కల్పించటం కోసం అవిశ్రాంతంగా ఉద్యమించారు. భారత జాతీయ కాంగ్రెస్ సభ్యురాలిగా పలు కార్యక్రమాలను చురుగ్గా నిర్వహించిన ఆమె అఖిల భారత జాతీయ మహిళా కాన్ఫరెన్స్ ఏర్పాటుకు శ్రమించారు. శ్రీమతి సరోజిని నాయుడు, శ్రీమతి రాణి రజ వాడే, శ్రీమతి కమలాదేవి ఛటోపాధ్యాయలతో కలసి అఖిల భారత మహిళా కాన్ఫరెన్స్ వ్యవస్థాపక సభ్యురాలిగా షరీఫా అలీ గణుతి కెక్కారు. అఖిల భారత జాతీయ మహిళా కాన్ఫరెన్స్ నాయకురాలిగా మహిళల హక్కుల సాధనకు పూను కున్నారు. ప్రధానంగా మహిళల వివాహ వయస్సు పెంపుదల, ముస్లిం మహిళల వివాహ హక్కులతోపాటుగా పలు న్యాయపరమైన సంస్కరణల కోసం ఆమె శ్రమించారు. ముస్లింల నిఖా నామాను ఆమె రూపొందించి, ఆ నిఖానామా అమలుకు కృషి చేశారు. మహిళల హక్కుల సాధనకు ఆమె సాగించిన ప్రయత్నాలలో భాగంగా జాతీయ, అంతర్జాతీయ వేదికల నుండి తన వాణిని విన్పించారు. భారతదేశం పక్షాన పలు అంతర్జాతీయ సంస్థలలో విభిన్న బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించిన షరీఫా హమీద్ అలీ 1971లో తన 88 ఏండ్ల వయస్సులో బొంబాయి మహానగరంలో కన్నుమూశారు. ✤



**9440241727**

బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరిం చిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త

**సయ్యద్ నశీర్ అహమ్మద్**

రూపొందించిన ఆల్బమ్

**'చరితార్థులు' - 2 (తెలుగు)**

THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం




## హిబా అర్జుమంద్ ఖాన్

**ఇస్లామ్ ధర్మంలో ముహర్రమ్ నెలకు చాలా ప్రాముఖ్యం ఉంది. ఇస్లామీయ క్యాలండరు ప్రకారం సంవత్సరంలోని మొదటి నెల 'ముహర్రమ్' .**

ఇది చాలా గౌరవప్రదమైన, ఘనమైన, ప్రియమైన, శుభప్రదమైన నెల. కనుక ఇతర నెలల కంటే ఈనెలలో అధికంగా సత్కార్యాలు ఆచరించే ప్రయత్నం చెయ్యాలి. ఎందుకంటే, 'ఇది అల్లాహ్ నెల' అన్నారు ముహమ్మద్ ప్రవక్త (సం).

దైవం భూమ్యాకాశాలను సృష్టించినప్పటి నుండీ ఆయన గ్రంథంలో (ఖుర్ఆన్‌లో) నెలల సంఖ్య పన్నెండు మాత్రమే. పన్నెండులో నాలుగు నెలలు అత్యంత గౌరవప్రదమైనవి. అందులో ఒకటి ముహర్రమ్ నెల. రమజాన్ నెల తరువాత అత్యంత శుభప్రదమైన నెల ముహర్రమ్. కాని ధార్మిక పరిజ్ఞానం లేని చాలామంది ఈ నెలలో హజ్రత్ ఇమామె హుసైన్ అమరు దయ్యారు కాబట్టి ఇది మంచి నెల కాదని, శోక దినాలు కాబట్టి ఈ నెలలో ఏ విధమైన శుభకార్యాలు చేయకూడదని భావిస్తారు. కాని అలాంటిదేమీ లేదు. అన్ని రోజులూ, అన్ని నెలలూ, అన్ని ఘడియలూ మంచివే, శుభప్రదమైనవే. ఈ నెలలో ఒక విషాదకర సంఘటన జరిగినప్పటికీ, అది యాదృచ్ఛికమే తప్ప మరొకటి కాదు. అందుకని అపశకునంగా భావించడంగాని, ప్రత్యేకతలు ఆపాదించడంగాని చేయకూడదు. ఈ నెల పదవ తేదీన ముహమ్మద్ ప్రవక్త(స) మనుమడు ఇమామె హుసైన్ (ర) అమరులయ్యారు. ఆయన ప్రాణత్యాగం వెనుక ఒక మహోన్నత లక్ష్యం ఉంది. దాన్ని అర్థం చేసుకోవాలి.

ప్రతి సంవత్సరం ఈ నెల వస్తూనే ముహమ్మద్ ప్రవక్త(స) వారి జీవితంలోని ముఖ్యమైన 'హిజ్రత్' సంఘటనను కూడా

గుర్తుకు తెస్తుంది. అంటే, ముహమ్మద్ ప్రవక్త (స) మక్కా నుండి మదీనాకు వలస వెళ్ళడాన్ని హిజ్రత్ అంటారు. జిల్ హజ్ నెల చివరి దినాల్లో ప్రవక్త వారు మక్కా నుండి ప్రయాణం ప్రారంభించి ముహర్రమ్ ఒకటవ తేదీకల్లా మదీనాకు చేరుకున్నారు. హజ్రత్ ఉమర్(ర) దీన్నే ప్రారంభ నెలగా ఖరారు చేసి ఇస్లామీయ క్యాలండరుకు రూపకల్పన చేశారు. అప్పటి నుండి హి.శ ఇస్లామీయ క్యాలండరు ఉనికిలోకి, వాడకంలోకి వచ్చింది. అంటే సంవత్సరంలోని పన్నెండు నెలల్లో ముహర్రమ్ మొదటి నెల, జిల్ హజ్జా చివరి నెల అన్నమాట. హిజ్రత్ తరువాతనే ధర్మానికి జవసత్వాలు సమకూరాయి, ధర్మం ఎల్లెడలా విస్తరించింది. ధర్మ పరిరక్షణ, మానవ సేవ, మానవులకు సత్యసందేశాన్ని అందించడం లాంటి మహత్తర ఆశయం కోసం కష్ట నష్టాలను సహించాల్సి వచ్చినా, చివరికి స్వదేశాన్ని విడిచి హిజ్రత్ (వలస) వెళ్ళవలసి వచ్చినా, ప్రాణ నష్టం సంభవించే ప్రమాదం ఉన్నా వెనకాడకూడదనే విషయాన్ని ముహర్రమ్ ప్రతి సంవత్సరం విశ్వాసులకు గుర్తుచేస్తూ ఉంటుంది.

నిజానికి ఇస్లాం ధర్మంలో అమరత్వం (షహాదత్ ) అనేది చాలా ప్రాముఖ్యం కలిగిన స్థాయి. అనేక మంది ప్రవక్తలు, సహాబాల అమరత్వాన్ని కాంక్షించారు. ఒకసారి నాల్గవ ఖలీఫా హజ్రత్ అలీ (రజి)పై హత్యా ప్రయత్నం జరిగింది. ఆయన కింద పడిపొయ్యారు. అప్పుడాయన, 'కాబా ప్రభువు సాక్షి.. నేను సఫలమయ్యాను' అన్నారు. స్వయంగా ముహమ్మద్ ప్రవక్త (స) కూడా షహాదత్‌ను కాంక్షించారు.

### ఆషూరా ఉపవాసం

ముహమ్మద్ ప్రవక్త (స) మక్కా నుండి మదీనాకు వెళ్ళినప్పుడు ముహర్రమ్ నెల పదవ తేదీన అక్కడి యూదులు ఉపవాసం పాటిస్తున్నారు. అది చూసి ముహమ్మద్ ప్రవక్త (స), ఏమిటీ ఈ రోజు విశేషం అని వారిని అడిగారు. దానికి వారు– ఇది చాలా గొప్పరోజు. హజ్రత్ మూసా ప్రవక్తను, ఆయన జాతిని ఫిరౌన్ ఆగడాల నుండి దైవం రక్షించిన రోజు. ఫిరౌన్‌ను, ఫిరౌన్ సైన్యాన్ని సముద్రంలో ముంచి చంపేసిన రోజు. ఫిరౌన్ దౌర్జన్యాల నుండి ప్రజలకు విముక్తిని ప్రసాదించినందుకు మేము దైవానికి కృతజ్ఞతలు తెలుపుతూ ఉపవాసం పాటిస్తున్నాము అని చెప్పారు. అప్పుడు హజ్రత్ ముహమ్మద్ ప్రవక్త (స), హజ్రత్ మూసా ప్రవక్త అనుసరణలో రోజా పాటించడానికి మీకంటే మేమే ఎక్కువ హక్కుదారులం. అని చెప్పి, తమ అనుచరులకు ఉపవాసం పాటించమని ఉపదేశించారు. ముహర్రమ్ పదవ తేదీ ఆషూరా ఉపవాసం కేవలం యూదులే కాదు, క్రైస్తవులు కూడా పాటించేవారు. ఈ ఇరు వర్గాలూ ముహర్రమ్ పదవ తేదీన మాత్రమే రోజా పాటించేవి. కాని ముహమ్మద్ ప్రవక్త(స) వారు, మీరు రెండు రోజులు పాటించమని తన సహచరులకు సూచించారు. అంటే ముహర్రమ్ మాసం 9,10 కాని, లేక 10,11 కాని రెండు రోజులు ఉపవాసం (రోజా) పాటించాలి. అనివార్య కారణం ఉంటే పదవ తేదీన ఒక్క ఉపవాసం పాటించినా తప్పులేదు. కావాలని మాత్రం అలా చేయకూడదు. ఆషూరా ఉపవాసం పాటించడం వల్ల తెలిసీ తెలియక జరిగిపోయిన ఒక సంవత్సర కాలపు చిన్న చిన్న పాపాలు క్షమించబడతాయని ప్రవక్త వారు చెప్పారు. కనుక ముహర్రమ్ నెల ఔన్నత్యాన్ని, హజ్రత్ ఇమామె హుసైన్ (రజి) త్యాగాన్ని సరైన విధంగా తెలుసుకొని, అర్థం చేసుకొని నడుచుకోవాలి. ధర్మంలో లేని దురాచారాలకు దూరంగా ఉంటూ, ప్రవక్త మహనీయుల వారి సంప్రదాయం వెలుగులో జీవితాలను తీర్చిదిద్దుకునే ప్రయత్నం చెయ్యాలి. దైవం మనందరికీ సరైన ధార్మిక పరిజ్ఞానాన్ని అనుగ్రహించాలని కోరుకుందాం. ✤

### ఇస్లామీయ నెలల పేర్లు:

1. ముహర్రమ్
2. సఫర్
3. రబీఉల్ అవ్వల్
4. రబీఉస్సానీ
5. జమాదిఉల్ అవ్వల్
6. జమాది ఉస్సానీ
7. రజబ్
8. షాబాన్
9. రమజాన్
10. షవ్వాల్
11. జుల్ ఖఅద
12. జుల్ హిజ్జ



# ఈరాన్‌పై అమెరికా ప్రత్యక్ష దాడి: ద్వంద్వనీతికి పరాకాష్ట

**యండి. ఉస్మాన్ ఖాన్, సీనియర్ జర్నలిస్ట్**

**ఈరాన్‌పై యుద్ధానికి** దిగాలా వద్దా అనే అంశంపై నిర్ణయం తీసుకోవడానికి రెండు వారాల గడువు ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్, రెండు రోజులు కూడా గడవక ముందే ఈరాన్ పై దాడికి దిగి, తనది నాలుక కాదు, తాటి మట్ట అని మరోసారి నిరూపించుకున్నాడు. ఈ విషయం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. దీనిద్వారా అమెరికా మాట మీద నిలబడని దేశంగా, నైతికతను తుంగలో తొక్కే శక్తిగా, ద్వంద్వనీతికి పరాకాష్టగా నిలిచింది.

ఈ దాడిలో ఈరాన్‌లోని మూడు కీలక అణు కేంద్రాలపై అమెరికా బీ – 2 స్టెల్త్ బాంబర్లతో దాడులు చేసింది. ఫోర్డా, నటాంజా, ఇస్ఫహాన్ వంటి కేంద్రాలు నిశ్చిత లక్ష్యాలుగా మారాయంటే, ఇది కాకతాళీయంగా జరిగిందని చెప్పలేము. ఇది పూర్తిగా వ్యూహాత్మకంగా, ఈరాన్ ఆయువు పట్టుపై దెబ్బకొట్టడమే లక్ష్యంగా చేపట్టిన ప్రణాళికాబద్ధ చర్యగా స్పష్టమవుతోంది.

ఈరాన్‌పై దాడికి దిగాలా వద్దా అన్న విషయమై స్పష్టతకు ట్రంప్ రెండు వారాల గడువు ప్రకటించినప్పటికీ, ఆ నిర్ణయం ముందే తీసుకున్నదని తెలిసిపోతోంది. 'మాడ్ మాన్ పాలసీ' అనే పాత అమెరికన్ వ్యూహానికి ఇది నిఖార్సైన ఉదాహరణ. అబద్ధాలు చెప్పి ఎదుటి వారిని నమ్మించడం, నిర్ణయం ముందే తీసుకుని కొన్ని రోజుల్లో, కొన్ని వారాల్లోనో నిర్ణయం తీసుకుంటామని నిస్సిగ్గుగా మాయమాటలు చెప్పి, ప్రత్యర్థి ఊపిరి తీసుకునేలోపే అనూహ్యంగా దాడికి తెగబడి దొంగదెబ్బ కొట్టే పాలసీ. అనైతికతకు ఇంతకంటే దారుణమైన ఉదాహరణ మరొకటి ఉండబోదు.

ఇస్రాయీల్ జూన్ 13 న ఈరాన్‌పై గగనతల దాడులకు దిగినప్పుడే, అమెరికా మద్దతు ఉన్నదన్న అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఇప్పుడు అమెరికానే స్వయంగా రంగంలోకి

దిగడం వల్ల, అది కేవలం అనుమానం కాక, స్పష్టమైన ఆమోదమని తేటతెల్లమైంది. ఇది రెండు దేశాల మధ్య వివాదం కాదని, పశ్చిమ సామ్రాజ్య శక్తులు, ప్రపంచ వ్యాప్తంగా పునరుత్థానమవుతున్న ప్రతిఘటన శక్తుల మధ్య జరిగే మౌలిక విలువల సంఘర్షణగా అభివర్ణించాల్సిన పరిణామం.

ఈ దాడికి ప్రతిస్పందనగా  ఈరాన్ అమెరికాకు ధీటైన సమాధానం చెప్పింది. వివిధ ప్రాంతాల్లోని అమెరికా ఎయిర్ బేస్‌లపై మిసైళ్ళ వర్షం కురిపించింది. ఈరాన్ సైనిక జనరల్ మాట్లాడుతూ, 'ట్రంప్ ప్రారంభించాడు, ముగింపు మేం పలుకుతాం' అని ఘాటుగా హెచ్చరించారు. అంతేకాదు ఈరాన్ విదేశాంగ శాఖ హోర్ముజ్ జలసంధిని తాత్కాలికంగా మూసి వేస్తున్నామని ప్రకటించింది. ప్రపంచ చమురు సరఫరాలో కీలకమైన ఈ మార్గాన్ని మూసివేయడం మామూలు విషయం కాదు  ఇది అణుబాంబుకు సమానమైన ఆర్థిక దెబ్బ. దీనివల్ల ఒమాన్, బహ్రెయిన్, కువైట్ వంటి దేశాలకు చమురు సరఫరా నిలిచినట్లయింది. ఇది ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు అమాంతం పెరిగేలా చేసింది. అంతర్జాతీయంగా బ్రెంట్ క్రూడ్ ధర 102 డాలర్లకు చేరగా, స్టాక్ మార్కెట్లు కుదేలయ్యాయి. ఇది కేవలం ప్రాంతీయ ఉద్రిక్తత కాదు, అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థకే పెనుసవాలు.

## అమెరికా దాడిని ఖండించిన రష్యా, చైనా

ఈ దాడిపై రష్యా, చైనా తీవ్రంగా స్పందించాయి. రష్యా ఈ చర్యను 'అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధంగా, పౌర ఉద్దేశాలతో ఉన్న అణు స్థావరాలపై దాడిగా' ఖండించింది. 'ఇది మూడవ ప్రపంచ యుద్ధానికి ఆహ్వానం' అంటూ రష్యా భద్రతా మండలి ఉపాధ్యక్షుడు డిమిత్రి మెద్వెదేవ్ హెచ్చరించారు. చైనా ఈ దాడిని 'మధ్యప్రాచ్య స్థిరత్వాన్ని భంగపరిచే ప్రమాదకర మలుపు' గా అభివర్ణించింది. చర్చల ద్వారా పరిష్కారం కోరుతూ, అదే సమయంలో దాడి పునరావృతమైతే తమ మద్దతు ఈరాన్‌కే అని వెల్లడించింది.

అలాగే, రష్యా – ఈరాన్ మధ్య జనవరిలో కుదిరిన 20 ఏళ్ల బహుళరంగ ఒప్పందం ద్వారా రష్యా వ్యూహాత్మకంగా ఈరాన్‌కు మరింత దగ్గరైంది. చైనా కూడా బ్రిక్స్, చమురు, వాణిజ్య ఒప్పందాల ద్వారానే కాక, గాజా, తైవాన్ వంటి అంశాలలో అమెరికా చర్యలను ఖండిస్తూ ఈరాన్‌కు బలమైన మద్దతు ప్రకటిస్తోంది.

అయితే, గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్ (జీసీసీ) దేశాలు – ముఖ్యంగా సౌదీ అరేబియా, యూఏఈ, బహ్రెయిన్ – ఈ దాడిపై మౌనంగా ఉండడం గమనార్హం. గతంలో ఈరాన్‌తో విభేదాల్లో ఉన్నా, ఇప్పుడు వారి మౌనం అమెరికా వైఖరిని నిశ్శబ్దంగా ఆమోదించినట్టే కనిపిస్తోంది. ఇది ముస్లిం ప్రపంచంలో వారి చిత్తశుద్ధిపై అనేక ప్రశ్నలు లేవనెత్తుతోంది.

ఇలాంటి సమయంలో భారత ప్రభుత్వం నుంచి కూడా స్పష్టమైన స్పందన రాలేదు. వాణిజ్య ప్రయోజనాలు, చమురు దిగుమతులపై ప్రభావం పడుతుందేమోనని భారత్ భావిస్తున్నట్లు కనిపిస్తోంది. కానీ ఇది విలువల సమరం. మౌలిక న్యాయాన్ని, శాంతిని, అంతర్జాతీయ చట్టాల ప్రాముఖ్యతను నిలబెట్టే సమయం. చమురు ధరల పెరుగుదలతో ఇప్పటికే దేశీయ మార్కెట్‌పై ప్రభావం పడుతోంది. పైగా పశ్చిమాసియా ముస్లిం సమాజాల భావోద్వేగాల పట్ల నిర్లిప్తంగా వ్యవహరించడం విదేశాంగ విధాన శక్తిని తగ్గించవచ్చు.

ఈ దాడికి సంబంధించి జూన్ 20న ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి సమావేశమైనా, స్పష్టమైన తీర్మానం వెలువడలేదు. అయితే తాజా అమెరికా దాడుల నేపథ్యంలో ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరెస్ గళమెత్తారు. ఈ దాడిని 'అంతర్జాతీయ నిబంధనలను ఉల్లంఘించే, ప్రాంతీయ శాంతిని భంగపరిచే చర్య' గా పేర్కొన్నారు. అణు సౌకర్యాలపై దాడులు ప్రపంచ మానవాళి భద్రతకే ముప్పుగా మారుతాయి. శాంతికి మార్గం శత్రుత్వం కాదు, అని ఆయన హితవు పలికారు. ఐక్యరాజ్య సమితిలో గల ఈ ఒక్క గళమే ప్రస్తుతానికి విలువల వైపు నిలబడిన ఆశాజ్యోతి.

అయితే యూరప్ మాత్రం మరోవైపు నిశ్శబ్దంగా ఉంది. జర్మనీ, ఫ్రాన్స్ వంటి దేశాలు ప్రజాస్వామ్యాల పేరుపెట్టుకున్నా ఈ దాడిని ఖండించలేకపోతున్నాయి. నాటో భాగస్వామ్య భయమా, చమురు రాజకీయమా తెలియదు గాని, వారి మౌనం వారు పాటిస్తున్నామని చెబుతున్న  విలువలకే వ్యతిరేకం. ఇది యూరోపియన్ మానవహక్కుల వాదనలకు గట్టి పరీక్ష కూడా!

## తాజా పరిణామం - శాంతి పేరుతో నాటకం

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ జూన్ 24 న ఈరాన్ – ఇస్రాయిల్ మధ్య కాల్పుల విరమణ (ceasefire) అమలులోకి వచ్చిందని ప్రకటించాడు. ఈ ఒప్పందాన్ని ఇరుదేశాలు అంగీకరించినట్టు

**(గత సంచిక తరువాయి)**



# ఈరాన్ గుండెను చీల్చిన గూఢచారి...

ముహమ్మద్ హారూన్ అహ్మద్ ఖాన్

కెథరిన్ పెరెజ్ షక్‌దామ్–ఫ్రాన్స్‌కు చెందిన యువతి. ఈమె ఇస్లాం స్వీకరించింది. షియా మత ధర్మాన్ని అనుసరిస్తానని బహిరంగ ప్రకటన చేసింది.

ఈరానీయ విప్లవాన్ని మహా గొప్పగా పొగిడింది, విలాయతె ఫకీహ్ సిద్ధాంతానికి మద్దతు తెలిపింది. ఇస్లామ్ గొప్ప తనాన్ని ఉటంకిస్తూ అనేక వ్యాసాలు రాసింది.

ఇంతేకాదు, ఆమె రాసిన వ్యాసాలు స్వయంగా ఈరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖామనేయి అధికారిక వెబ్‌సైట్లో చోటు దక్కించుకున్నాయి.

కానీ ఇదంతా ముసుగు మాత్రమే...ఆ ముసుగు వెనుక అసలైన కన్ను 'మొసాద్' అనే ఇస్రాయిల్ గూఢచారి వ్యవస్థ.

ఈరాన్‌లో జరిగే ప్రతి అధికార, అనధికార కదలికనూ డేగ కంటితో గమనిస్తున్న గూఢచారి కన్ను కేథరిన్!

ఆమె ఒక గూఢచారి అన్న అనుమానమే రాకుండా, పూర్తి విశ్వసనీయురాలిగా, రచయితగా, ధర్మపరివర్తన చెందిన నవ ముస్లింగా దేశంలోకి ప్రవేశించింది.

ఒక రచయిత్రి, జర్నలిస్టు, విమర్శకురాలు, సామాజిక కార్యకర్తగా మారి రాజకీయ నాయకులతో సత్సంబంధాలు కొనసాగించింది, సమావేశాలు జరిపింది.

'పాస్ దారానె ఇంక్విలాబ్' అనే విప్లవ రక్షక దళంతో సంబంధాలు కొనసాగిస్తూ, అనేకసార్లు వారితో సంభాషణలు సాగించింది. ఇబ్రాహీం రైసీతోనూ సమావేశమైంది.

జర్నలిస్టిక్ రీసర్చ్ పేరిట అత్యంత రహస్య ప్రాంతాల వరకూ ప్రవేశించ గలిగింది.

అన్నిటికంటే ప్రమాదకరమైన, వ్యూహాత్మక ఆపరేషన్ ఈరాన్ రాజకీయ, సైనిక కుటుంబాలతో సత్సంబంధాలు.

**ఈరానీ ఉన్నత వర్గ మహిళలతో అంతర్గత సమావేశాలు**

ఆమె శాస్త్రవేత్తలు, సైనికులు, రాజకీయ ప్రముఖుల భార్యలతో సన్నిహిత సంబంధాలు ఏర్పరచుకుంది. వారి హృదయాలను గెలుచుకుంది.

వారు ఆమెను తమ 'సొంత సోదరి'గా భావించేవారు. అంతటి నమ్మకాన్ని, అంతటి విశ్వసనీయతను ఆమె వారి దగ్గర పొందింది. అసలు వారామెను పరాయి మనిషిగా ఏనాడూ చూడలేదు. అంతటి గాఢమైన బంధం పెనవేసుకు పోయింది. అది ఎంత దూరం వెళ్ళిందంటే, ఈరానీ మహిళలు తమ కుటుంబం, పిల్లలు, భర్తల గోప్యత, భద్రత, వారి అలవాట్లు, ప్రయాణాలు, ఇంటి పక్క పరిసరాలు వంటి ఎన్నో విషయాలను వారామెతో స్వేచ్ఛగా పంచుకునేవారు. ఈరానీ మహిళల సోదరిగా, గూఢచర్య ముసుగు కప్పుకున్న మాయలేడి ప్రతి విషయాన్ని రికార్డు చేసి ఇస్రాయీల్‌కు చేరవేసింది. ఈ నమ్మక ద్రోహం చివరికి ఆ ఈరానీ మహిళల భర్తల ప్రాణాల మీదకు తెచ్చింది. మాయలేడి కేథరిన్ అందించిన సమాచారం ఆధారంగా ఇస్రాయీల్

మూకలు వారి కదలికల్ని పసిగట్టి హతమార్చేవారు. ఈ మరణాల వెనుక అపనమ్మక ద్రోహితో అమాయకపు ఈరానీ మహిళలు పంచుకున్న సమాచారమే ఉందనేది ఎంత భయంకరమైన వాస్తవమో ఊహించండి. ఒక నవ ముస్లిం అని నెత్తిన పెట్టుకొని, సొంత సోదరిలా ఆదరిస్తే చివరికి తిన్నింటి వాసాలు లెక్కబెట్టి, తనకు నీడనిచ్చి, ఆదరించి, గౌరవించి, చివరికి సొంత సోదరిగా కూడా బంధం కలుపు కుంటే వారి భర్తల ఉసురు తీసి విధవలుగా మార్చింది. వారి పిల్లలను అనాధలుగా మార్చింది. నిర్దాక్షిణ్యంగా దేశాన్ని నాశనం చేయడానికి కంకణం కట్టుకుంది.

### చివరికి పట్టుబడతానన్న అనుమానంతో

ఆమె ఒక్కసారిగా ఈరాన్ విడిచి పారిపోయింది. రహదారులు దిగ్బంధనం చేసే లోపే తప్పించుకుని పారిపోయిందంటే ఎంతటి ఆరితేరిన గూఢచారో అర్ధమవుతుంది.

అయితే, అప్పటికే ఆమె తన పని పూర్తి చేసుకుంది.

ఈరాన్‌కు తీవ్ర గాయాలను మిగిల్చింది. ఎప్పటికీ నయం కాని మానసిక గాయాలు!

ఈమె అందించిన సమాచారాన్ని ఆధారంగా చేసుకుని ఇస్రాయీల్ ఇప్పటికీ రహస్య కార్యకలాపాలు నిర్వహిస్తూనే ఉంది.

ఇది కేవలం గూఢచారి కేథరిన్ విజయం కాదు. ఇది ఒక దేశ భద్రత వ్యవస్థ వైఫల్యం అంటే అతిశయోక్తి కాబోదు.

### అంటే, నేటి ఆధునిక యుగంలో ...

పోరాటాలు బుల్లెట్ తూటాలతో కాదు… మాటల తూటాలతో సాగుతున్నాయి.

విశేషంగా, మహిళల మధ్య అనుసంధాన వలయాల్లోనే ఓ మారణాయుధం దాగివుంది.

ఇప్పుడు మన ముందున్న ప్రశ్న ఏమిటంటే,

ఈరాన్ ఈ భద్రతా లోపం నుంచి బయట పడగలుగు తుందా?

ఇలాంటి మరో 'కేథరిన్' ఎక్కడో మరో దేశంలో మరో వేషంలో ప్రవేశించలేదని గ్యారంటీ ఏమిటి?! ✤

## ఈరాన్‌పై అమెరికా ప్రత్యక్ష దాడి: ద్వంద్వనీతికి పరాకాష్ట (15వ పేజీ తరువాయి)

అమెరికా తెలిపినా, అధికారికంగా ఈరాన్ స్పష్టమైన ప్రకటన చేయకపోవడం గమనార్హం. అదేరోజు బీజర్‌షెబా నగరంలోని నివాస ప్రాంతాలపై మిస్సైల్ దాడి జరగడం వల్ల ఈ సీజ్ ఫైర్ కేవలం ట్రంప్ ప్రాయోజితమని తేలిపోయింది. దాడిలో పదుల సంఖ్యలో ప్రాణనష్టం సంభవించగా, వందల్లో క్షతగాత్రు లయ్యారు. ఇస్రాయీల్ ఈ చర్యను ఉల్లంఘనగా పేర్కొంది.

ఈరాన్ మాత్రం, 'హర్మోజ్ జలసంధి పరిసర ప్రాంతాల్లో ఇస్రాయీలే ముందుగా డ్రోన్లతో గగనతల దాడులు చేసింద'ని ఆరోపించింది. అంటే, రెండువైపుల నుంచి స్పష్టమైన మౌఖిక అంగీకారం లేకుండానే, అమెరికా అధ్యక్షుడు ఏకపక్ష ప్రకటన చేశాడన్నమాట. ఇది అమెరికా ద్వంద్వ నీతికి తాజా నిదర్శనం. ఒకవైపు శాంతిదూతగా నటన, మరోవైపు బాంబర్లను సిద్ధంగా ఉంచే యుద్ధ వ్యూహం. నిజంగా శాంతిని కోరే దేశమైతే మౌఖిక ప్రకటనలకంటే, స్పష్టమైన, బాధ్యతాయుతమైన ఒప్పందాలకు విలువనిస్తుంది. కానీ ఇక్కడ జరుగుతున్నది శాంతి పేరుతో అశాంతిని ప్రోది చేయడం మాత్రమే.

### విలువలపై దాడి

ఇది కేవలం ఒక బాంబింగ్ దాడి కాదు. విలువలపై దాడి. అంతర్జాతీయ సమతౌల్యతపై దాడి. మౌలిక మానవ హక్కులపై దాడి. సామ్రాజ్యవాద ధోరణులపై ప్రపంచం నిశ్శబ్దంగా ఉంటే, శాంతికి చరమగీతం పాడినట్లే అవుతుంది. ఈ దాడిని ఖండిం చకపోతే మన మౌనం భవిష్యత్తుకు శవపేటికగా మారుతుంది.

ప్రపంచం మళ్లీ ఒక విభజిత శకం వైపు ప్రయాణిస్తుంది. ఐక్యత, న్యాయం, భౌగోళిక సమతుల్యత అనే విలువలు కేవలం మాట లకే పరిమితం కాకుండా, వాటికి ఆచరణీయ రూపమివ్వాల్సిన అవసరం ఇప్పుడు మరింత పెరిగిపోయింది. ఈ పరిణామాలపై కనీసం మౌనంగా ఉండకుండా ప్రశ్నించే ధైర్యం, విశ్లేషించే స్పష్టత, శాంతికి ప్రాధాన్యతనిచ్చే చైతన్యం కనబరిచే సమయం ఇది. ప్రపంచం మళ్లీ అంధకారంలోకి జారకూడదంటే, ప్రజల బాధ్యతే దీపంగా మారాలి.

✤

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్హీముల్ ఖుర్ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది ఖుర్ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

35 ఆయత్‌లు

# 46. అల్ అహ్కాఫ్

మక్కా అవతరణ

9–10 వీరికి చెప్పు, "నేనేదో సరికొత్త సందేశహరుణ్ణయితే కాను, రేపు మీ పట్ల ఏమి జరగనున్నదో, నా ఎడల ఏమి సంభవించనున్నదో నేనేమీ ఎరుగను. నేను కేవలం నా వద్దకు పంపబడే వహీని మాత్రమే అనుసరిస్తూ ఉంటాను. మరి నేనొక అతి స్పష్టంగా హెచ్చరించేవాణ్ణి తప్ప మరేమీ కాను."[12] ప్రవక్తా, వీరికి చెప్పు, "మీరెప్పుడయినా ఆలోచించారా, ఈ వచనం అల్లాహ్ పక్షానే వచ్చి ఉండి, మీరు దీన్ని తిరస్కరించినట్లయితే (పరిణామం ఏమవు తుందో[13])? దీని మాదిరి ఒక వచనం పట్లనయితే బనీ ఇస్రాయీల్‌లోని ఒక సాక్షి సాక్ష్యమూ పలికి ఉన్నాడు. అతను విశ్వాసం గైకొన్నాడు. మీరేమో మీ పొగరులోనే పడి ఉండిపోయారు.[14] ఇటువంటి దుర్మార్గులకు అల్లాహ్ మార్గబోధన చెయ్యనే చెయ్యడు."

(12 వ పాదసూచిక గత సంచిక తరువాయి)

ఇంతకు ప్రపంచంలో పిల్లాజెల్లా లేనివాడు, తింటూ త్రాగుతూ ఉండనివాడు, సాధారణ జనుల్లా జీవితం గడపనివాడు ప్రవక్తగా ఎప్పుడు వచ్చాడని? ఏ ప్రవక్తతో పాటు దైవదూత అవతరించి అతడు దైవ సందేశహరుడని ప్రకటిస్తూ అతని ముందర కొరడా చేత పట్టుకుని తిరగాడని? ఏ దైవ సందేశహరుని కోసం తోటలు, భవంతులూ సృష్టించబడ్డాయని? ఏ ప్రవక్త దేవుని వైపునకు పిలుపునిస్తూ నేను భరిస్తూ ఉన్న కష్టాలు భరించలేదని? ఏ దైవ సందేశహరుడు తన అధికారంతో ఏదయినా మహిమ చూపించ గలిగినవాడు, లేదా తన జ్ఞానం ద్వారా సర్వం ఎరిగిన వాడు లోగడ వచ్చాడని? అలాంటప్పుడు ఈ కొంగ్రొత్త ప్రమాణాలు నా దైవదౌత్యాన్ని పరీక్షించడానికే మీరు ఎక్కడి నుండి కల్పించి తెస్తున్నారు? అన్నది భావం.

ఆ తరువాత, "రేపు మీ పట్ల ఏమి జరగనున్నదో, నా యెడల ఏమి సంభవించనున్నదో నేనేమీ ఎరుగను, నేను కేవలం నా వద్దకు పంపబడే వహీని మాత్రమే అనుసరిస్తూ ఉంటాను" అని చెప్పమని కూడా పురమాయించబడింది. అంటే, అజ్ఞాత విష యాల జ్ఞానం నాకు లేదు, భూత, వర్తమాన, భవిష్యత్ కాలాలలోని వన్నీ నాకు ప్రస్ఫుటంగా తేటతెల్లంగా కనబడటానికీ, ప్రపంచం లోని ప్రతి విషయమూ నాకు తెలియడానికి. మీ భవిష్యత్తు అలా ఉంచి స్వయంగా నా భవిష్యత్తు సయితం నాకు తెలియదు. వహీ ద్వారా ఏ విషయమయితే నాకు తెలుపబడుతుందో అది మటుకే నాకు తెలుసు. అంతకుమించి ఏమయినా నాకు తెలుసని నేనెప్పుడు చెప్పాననీ, ఇంకా మరే ప్రవక్త ఇటువంటి జ్ఞానమున్న వాడు ప్రపంచంలో ఎప్పుడయినా గతించాడనీ మీరు నా దైవ దౌత్యాన్ని పరీక్షించడానికి నా అజ్ఞాత విషయాల జ్ఞానాన్ని పరీక్షిస్తూ ఉన్నారు? తప్పిపోయిన వస్తువుల జాడ తెలుపడం, గర్భం ధరించిన స్త్రీకి పుట్టబోయే శిశువు మగవాడా ఆడదా అనే విషయం తెలుపడం, ఒకరి రోగం నయమవుతుందా కాదా లేదా అతను చనిపోతాడా అన్నది చెప్పడం దైవసందేశహరుని పనా?

చివరగా, "నేనొక అతి స్పష్టంగా హెచ్చరించేవాణ్ణి తప్ప మరేమీ కాను" అని చెప్పివేయమని బోధించడం జరిగింది. అంటే, నేను దైవత్వపు అధికారాలు గలవాణ్ణి కాను, మీరు అనుదినం నన్ను చూపమని కోరుతున్న వింతయిన మహిమలు మీకు చూప డానికి. నన్ను పంపిన పని కేవలం, జనులకు రుజుమార్గాన్ని తెలుపడం, దాన్ని స్వీకరించనివారికి దుష్పరిణామాన్ని గురించి హెచ్చరించడం మాత్రమే.

13. ఇది, లోగడ 'హామీమ్ అస్ సజ్దా'లోని 52వ ఆయత్‌లో మరో విధంగా వచ్చిన విషయమే. వివరణ కొరకు చూడండి ఖుర్ఆన్ అవగాహనం: సం. 7, హా మీమ్ అస్ సజ్దా:పాద సూచి 69.

14. వ్యాఖ్యాతల ఒక పెద్ద వర్గం ఈ సాక్షి హజ్రత్ అబ్దుల్లా బిన్ సలామ్ అని అంటారు. ఈయన మదీనా పుణ్యపురిలోని ప్రఖ్యాత పండితుడు. హిజ్రత్ తరువాత ప్రవక్త (స)ని విశ్వసించిన వారు. ఇది మదీనాలో జరిగింది కాబట్టి ఈ ఆయత్ మదీనాలో అవతరించిందని ఈ వ్యాఖ్యాతల అభిప్రాయం. ఈ వ్యాఖ్యానా నికి ఆధారం హజ్రత్ సఅద్ బిన్ అబీ వక్కాస్ తెలిపిన విషయం. ఆయన ప్రకారం ఈ ఆయత్ హజ్రత్ అబ్దుల్లా బిన్ సలామ్ విషయంలోనే అవతరించింది. *(బుఖారీ, ముస్లిమ్, నసాయి, ఇబ్ను జరీర్).*

**14వ పాదసూచిక మిగతా వచ్చే సంచికలో)**

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (6వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమా (ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ الْمَغَازِيْ

## 4. యుద్ధాల ప్రకరణం -2

(కితాబుల్ మగాజీ)

## పవక్త మహనీయులు (సఅసం) పరమపదించిన సంఘటన

**291)** మహనీయ ఇబ్నె అబ్బాస్(రజి) సయీద్ బిన్ జుబైర్ ముందు గురువారం గురించి ప్రస్తావిస్తూ, 'గురువారం నాడు ఏం జరిగిందో తెలుసా?' అనడిగారు. ఆ రోజు దైవప్రవక్త(స) వ్యాధి తీవ్రతరమయింది. అప్పుడాయన(స), "ఏదయినా (వ్రాత సామగ్రి) తీసుకురండి, నేను మీ కొరకు వీలు వ్రాస్తాను. మీరు గనక దాని ప్రకారం నడుచుకుంటే ఎన్నటికీ సన్మార్గం వీడరు" అని పలికారు. అయితే దీనిపై సహచరమాన్యులలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. నిజానికి దైవప్రవక్త(స) సమక్షంలో అలాంటి తర్జన భర్జన జరగకూడదు. 'ఆయన(స) వ్యాధి తీవ్రత కారణంగా ఏదేదో అనేస్తున్నారు. అసలు విషయం ఏమిటో అడిగి కనుక్కోండి' అని కొందరన్నారు. ఆ విషయమే ప్రియ సహచరులు ఆయన్ని అడిగితే, "పొండి (ఇక్కడ మీరు గలాటా చేయకండి). ఇప్పుడు నేను ఏ పనిలో నిమగ్నమై ఉన్నానో, అది మీరు అడుగుతున్న దానికన్నా మేలైనది" అని దైవప్రవక్త(స) చెప్పారు. ఆ తరువాత ఆయన(స) తన సహచరమాన్యులకు మూడు విషయాల గురించి తాకీదు చేశారు- 1) బహుదైవారాధకులను అరేబియా ద్వీపం నుండి తీసివేయండి. 2) (వివిధ తెగల తరఫున) రాయబారులుగా మీ వద్దకు వచ్చిన వారిని, నేను ఆదరించినట్లుగానే ఆదరించండి. 3) మూడవ విషయాన్ని ఇబ్నె అబ్బాస్ లేదా సయీద్ బిన్ జుబైర్ లేదా సులైమాన్ వివరించలేదు. మరచిపోయానని అన్నారు.[1]

**293)** విశ్వాసుల మాత హజ్రత్ ఆయిషా (ర.అ) వివరించారు: ప్రవక్త మహనీయులు (సఅసమ్) మరణ వ్యాధికి గురైనప్పుడు ఫాతిమా(ర.అ)ను పిలిచి, నెమ్మదిగా ఆమెకు ఏదో మాట చెప్పారు. అది విని ఆమె ఏడ్వసాగింది. తరువాత ఆయన (స) ఆమెకు నెమ్మదిగా మరో మాట చెప్పడంతో ఆమె నవ్వింది. తరువాత మేము దీని గురించి ఫాతిమా(ర.అ)ను దర్యాప్తు చేయగా ఆమె ఇలా వివరించారు- 'ఈ మరణ వ్యాధితోనే తాను మరణిస్తానని దైవప్రవక్త(స) చెప్పగానే నాకు ఏడుపు వచ్చింది. రెండవసారి ఆయన(స) నన్ను దగ్గరకు పిలిచి, తన ఇంటివారలలో అందరికన్నా ముందు నేనే ఆయన దగ్గరకు చేరుకుంటానని చెప్పడంతో నేను నవ్వాను'.

**294)** విశ్వాసుల మాత హజ్రత్ ఆయిషా(ర.అ) ఉర్వాతో ఇలా అన్నారు: ప్రతి దైవప్రవక్తకూ ప్రపంచం కావాలో, పరలోకం కావాలో ఎంపిక చేసుకునే స్వేచ్ఛ ఇవ్వబడేదని, ఈ ఎంపిక స్వేచ్ఛ ఇవ్వనంతవరకూ వారికి మరణం వచ్చేది కాదని నేను వింటూ ఉండేదానిని. తరువాత ఇదే విషయం నేను మహాప్రవక్త(సఅసమ్) నోట కూడా విన్నాను. మరణ వ్యాధికి గురైన సమయంలో ఆయన కంఠస్వరం బరువెక్కింది. ఆయన(స) ఈ ఆయత్‌ను పారాయణం చేయసాగారు : **'మఅల్లజీన అన్అమల్లాహు అలైహిమ్'** (వారు అల్లాహ్ అనుగ్రహానికి పాత్రులైన వారితో ఉంటారు) (అన్ నిసా: 69). ఇది విని, ఆయన(స) గారికి కూడా ఎంపిక స్వేచ్ఛ ఇవ్వబడిందన్న నా నమ్మకం దృఢమయింది.[1]

291-1. ''నా సమాధిని విగ్రహాలయంగా మార్చకండి'' అన్నదే ఆ మూడవ పలుకు అని ఉంది. ముఅత్తా ఇమామ్ మాలిక్ దీనిని పొందుపరిచారు.

294-1. అంటే ఆయన(సఅసమ్) పరలోకాన్ని ఎంపిక చేసుకున్నారు. వాఖిదీ ఇలా అంటారు: మహాప్రవక్త(స) ప్రపంచంలో ఏతెంచినప్పుడు అన్నింటికన్నా ముందు ఆయన(స) నోట వెలువడిన వాక్యం 'అల్లాహు అక్బర్'. మరణ సమయంలో ఆయన నోట వెలువడిన చివరి వాక్యం 'అల్ రఫీఖుల్ ఆలా' (ఆ పరమోన్నత మిత్రులే కావాలి).

# ఇస్లామ్ విశ్వాస వ్యవస్థ 2

- డాక్టర్ సాజిద్ అబ్బాసి

**అల్లాహ్ నక్షత్రాలను ఆకాశానికి అలంకారంగాను, రాత్రి చీకటిలో మార్గం తెలుసుకునే సాధనంగాను చేశాడు: "ఆయనే నక్షత్రాలను మీ కొరకు ఎడారి చీకటిలో, సముద్రపు చీకట్లలో మార్గాన్ని తెలుసుకునే సాధనంగా చేశాడు. చూడండి, మేము జ్ఞానవంతుల కొరకు సూచనలను విశదీకరించాము." (అల్-అన్ఆమ్: 97)**

అల్లాహ్ సూర్యచంద్రులను ఒక లెక్కకు కట్టుబడి నడుచుకునేలా చేశాడు. "సూర్యచంద్రులు ఒక నియమావళికి కట్టుబడి ఉన్నారు." (అర్రహ్మాన్: 5) సూర్యచంద్రులు కట్టుబడి ఉన్న ఈ లెక్కను ఉపయోగించి, సంవత్సరంలో ఏ రోజున సూర్యుడు ఏ సమయంలో ఉదయిస్తాడు, పూర్ణచంద్రుడు ఏ తేదీన కనిపిస్తాడు అనేది తెలుసుకోవచ్చు. అన్ని గ్రహాలు, నక్షత్రాలు ఒక నిర్దిష్ట వేగంతో తమ కక్ష్యలలో ప్రయాణిస్తున్న ఈ విశ్వం యాదృచ్ఛికమా? ఈ విశ్వంలో స్థిరమైన, మార్పులేని భౌతిక నియమాలు పని చేస్తున్నాయి. కాంతి, ధ్వని వేగాలు, గురుత్వాకర్షణ నియమం ప్రతిచోటా ఒకే విధంగా ఉంటాయి. ఈ వాస్తవాలు ఒక సృష్టికర్త వైపు మార్గనిర్దేశం చేస్తున్నాయి.

ఈ విశ్వంలో ఉన్న ప్రతిదీ వేర్వేరు ప్రయోజనాల కోసం సృష్టించ బడింది, అయితే ఈ మొత్తం విశ్వ సృష్టి నిరుపయోగంగా జరిగిందా? విశ్వం సృష్టి ఉద్దేశ్యం ఏమిటంటే, మనిషి దేవుడి గురించిన జ్ఞానాన్ని పొందడానికి ఇవన్నీ ఉపయోగపడాలి. అల్లాహ్ మనిషిని పరీక్షించడానికి ఈ భూమిపై మానవ జీవితాన్ని సాధ్యం చేసిన ఏర్పాట్లివి. అల్లాహ్ ఇలా తెలియజేశాడు, "ప్రభూ! ఇదంతా నీవు వ్యర్థంగా, లక్ష్యరహితంగా సృష్టించలేదు. నీవు పరిశుద్ధుడవు కాబట్టి నిష్ఫల కార్యాలు చెయ్యవు. " (ఆలి ఇమ్రాన్: 191)

ఖురాన్ గ్రంథంలో భూమ్యాకాశాలను, మనిషి తన లోపల ఉన్న చిహ్నాల గురించి ఆలోచించాలని చెబుతుంది. ఆ విధంగా మనిషి ఈ చిహ్నాలను చూసి అల్లాహ్‌పై విశ్వాసాన్ని పెంపొం దించుకునే అవకాశం ఉంది.

మానవుడు అల్లాహ్ సృష్టించిన వాటిని ఉపయోగించి యంత్రా లను కనిపెట్టాడు. ప్రతి యంత్రంతో ఏదో ఒక ప్రయోజనం ఉంటుంది. యంత్రంలోని ప్రతి భాగం కూడా ఒక ప్రయోజనాన్ని కలిగి ఉంటుంది. అదేవిధంగా, శరీరం లోని ప్రతి కణానికి, కోట్లాది కణాలతో ఏర్పడిన ప్రతి శరీర భాగానికి కూడా ప్రత్యేక ప్రయోజనాలుంటాయి. మానవుడు తయారుచేసిన ఏ వస్తువు స్వయంగా దానికదే తయారు కాలేదు. ప్రయోజనకరమైన వస్తువులు ఏవీ స్వయంగా వాటికవే తయారు కావు. విశ్వంలోని ప్రతి వస్తువు ఏదో ఒక ప్రయోజనాన్ని నెరవేరుస్తున్నప్పుడు, ఈ విశ్వం స్వయంగా దానికదే ఉనికిలోకి వచ్చిందని చెప్పలేము. మానవ శరీరంలోని ప్రతి అవయవానికి వేర్వేరు ప్రయోజనాలు ఉన్నప్పుడు, మొత్తం మానవ ఉనికికి ఉద్దేశ్యం ఏమిటి? ఇది ఆలోచించదగిన విషయం.

ఈ విశ్వం మానవుల వినియోగం కోసం సృష్టించబడిందని ఖురాన్ మనకు చెబుతుంది: "ఆయనే ధరణిలో ఉన్న సమస్తాన్నీ మీ కొరకు సృష్టించినవాడు. తరువాత తన ధ్యానాన్ని పైకి మరల్చి సప్తాకాశాలను సృజించినవాడూ ఆయనే. ప్రతి విషయమూ క్షుణ్ణంగా తెలిసినవాడూ ఆయనే." (బఖరా: 29) అదేవిధంగా, మనిషిని పరీక్షించే ఉద్దేశ్యంతో అతడిని సృష్టించడం జరిగింది. "మేము మానవుణ్ణి పరీక్షించటానికి అతనిని ఒక మిశ్రమ

వీర్యబిందువుతో సృష్టించాము. ఈ లక్ష్యం కోసం మేము అతనిని వినేవాడుగా, చూసేవాడుగా చేశాము. మేము అతనికి మార్గం చూపాము  ఇక అతను కృతజ్ఞతలు తెలిపేవాడైనా కావచ్చు లేదా సత్యాన్ని తిరస్కరించే వాడైనా కావచ్చు." (ఇన్సాన్: 2)

మరొక చోట ఇలా చెప్పబడింది: "నేను జిన్నాతులనూ, మానవులనూ నా ఆరాధన కొరకు తప్ప మరి దేనికొరకూ సృష్టించలేదు." (జారియాత్: 56) ఈ రెండు వచనాలను కలిపి చూస్తే, మానవుని ఉనికి ఉద్దేశ్యం తెలుస్తుంది. దేవుడిని చూడకుండా ఎవరు ఆరాధిస్తారో, ఎవరు దేవుని మార్గాన నడుస్తారో చూడడానికి మనిషిని సృష్టించడం జరిగింది. అల్లాహ్ మనిషిని పరీక్షించడానికి అగోచరుడిగా ఉన్నాడు. తన ఉనికిని మనిషికి నిరూపించే లెక్కలేనన్ని చిహ్నాలు ఈ ప్రకృతిలో ఉంచాడు. ఈ చిహ్నాలను చూసిన తర్వాత కూడా సృష్టికర్తను తిరస్కరించడం, సృష్టికర్త మనిషి ఆలోచించడానికి మేధస్సును ఇచ్చినప్పటికీ బుద్ధీ వివేకాలను ఉపయోగించకపోవడం, సృష్టికర్తను తిరస్కరించడం మనిషి అతి పెద్ద వైఫల్యం. దీనికి శిక్ష నరకం. సృష్టికర్తను తిరస్కరించడం అంటే ఆయన ఉపకారాలను కూడా తిరస్కరించడమే. ఇది ఖచ్చితంగా మేలును మరవటమే. దీని శిక్ష నరకంలో నివాసం. పశ్చాత్తాపపడితే తప్ప ఇది క్షమించరాని నేరం.

సృష్టికర్తను తిరస్కరించే వారు సృష్టికర్తను ఎవరు సృష్టించారు అని అడుగుతారు? చర్చ కోసం ఎవరైనా సృష్టికర్తను 'A' సృష్టించాడు అని చెబితే. 'A'ని ఎవరు సృష్టించారు అనే ప్రశ్న తలెత్తుతుంది. 'A' సృష్టికర్త 'B' అని చెబితే, 'B' సృష్టికర్త ఎవరు అనే ప్రశ్న మళ్ళీ తలెత్తుతుంది. ఈ గొలుసు అంతులేని విధంగా కొనసాగుతుంది. ఎక్కడో ఒకచోట ఈ గొలుసు ఆగాలి. ఈ విశ్వం ఉనికిలో ఉన్నందున, దాని సృష్టికర్త, సృష్టించబడనివాడు (Uncreated), కారణం లేనివాడు (Uncaused). అల్లాహ్ ప్రతిదాని సృష్టికర్త. అల్లాహ్ స్వయంగా సృష్టించబడలేదు. ప్రతిదీ ఏదో ఒక కారణం (Cause) వల్ల ఉనికిలోకి వచ్చింది, కానీ అల్లాహ్ కారణంలేనివాడు (Uncaused). "ఆయనే ఆరంభమూ, ఆయనే అంతమూ  అయనే బాహ్యమూ, ఆయనే గూఢమూ. ఆయనకు ప్రతి వస్తువును గురించి తెలుసు. " (హదీద్: 3).

ఈ వాక్యంలో అల్లాహ్ కంటే ముందు ఏ ఉనికి లేదని చెప్పబడింది. సృష్టికర్త ఉనికికి నిదర్శనంలో దేవుని ఏకత్వం రుజువు కూడా దాగి ఉందని ఇక్కడ గమనించాలి. సృష్టించబడని, కారణరహిత ఉనికి ఒకటే ఉండడం సాధ్యం. రెండు లేదా అంతకంటే ఎక్కువ సాధ్యం కాదు. రెండు స్టీరింగ్స్, ఇద్దరు డ్రైవర్లు, ఇద్దరికీ సమాన శక్తి ఉండి, ఇద్దరూ స్టీరింగ్ తిప్పడానికి స్వతంత్రంగా ఉంటే ఆ కారు ప్రమాదాలకు  గురికాకుండా ఉంటుందా? ఇదే విషయాన్ని ఖురాన్ ఇలా చెప్పింది: "ఒకవేళ ఆకాశంలో, భూమిలో ఒక్క అల్లాహ్ తప్ప ఇతర దేవుళ్లు కూడా ఉంటే, అప్పుడు (భూమ్యాకాశాల) రెండిరటి వ్యవస్థ ఛిన్నాభిన్నమై ఉండేది" (అంబియా: 22). ఇద్దరు దేవుళ్ళు సమాన శక్తి వంతులైతే, నిర్ణయాధికారాలు కలిగి ఉంటే వారు సంఘర్షించుకొని  విశ్వ వ్యవస్థ అస్తవ్యస్తం అవుతుంది. ఈ విశ్వానికి ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ సృష్టికర్తలు ఉండలేరు. ఇద్దరు ఉండి, వారిలో ఒకరు పెద్దవారు మరొకరు చిన్నవాడై, చిన్నవారు పెద్దవారిపై ఆధారపడి ఉంటే, అలాంటి సందర్భంలో ఆధారపడిన వ్యక్తి సృష్టికర్త కాలేడు. అందువల్ల, సృష్టికర్త ఒకరే ఉండాలి. ఈ విధంగా, దేవుని ఉనికికి రుజువులో దేవుని ఏకత్వానికి రుజువు కూడా ఉంది.

## సృష్టి నిదర్శనాలు

సృష్టించడం కేవలం అల్లాహ్‌కు సాధ్యం. ఈ ప్రపంచంలో మానవుడే అత్యంత తెలివైన జీవి. అతను వస్తువులను తయారు చేయగలడు కానీ సృష్టించలేడు. శాస్త్రవేత్తలందరూ కలిసి ఒక విత్తనాన్ని కూడా తయారు చేయలేరు. దానిని భూమిలో నాటితే మొక్క మొలకెత్తుతుంది. విత్తనం చూడటానికి నిర్జీవంగా ఉంటుంది. కానీ దానిని నిర్జీవమైన భూమిలో నాటి, భూమికి నీరు లభించినప్పుడు, అదే మృత భూమి నుండి జీవం ఉద్భవిస్తుంది. ఇది అల్లాహ్ సృష్టి. శాస్త్రవేత్తలందరూ కలిసి ఒక సజీవ కణాన్ని కూడా ఉత్పత్తి చేయలేరు. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "వారు సృష్టికర్త లేకుండా తమంతటతామే పుట్టారా? లేక వారు తమకు తామే సృష్టికర్తలా? లేక వారు భూమినీ, ఆకాశాలనూ సృష్టించారా? అసలు విషయం ఏమిటంటే, వారికి నమ్మకం లేదు." (తూర్: 35)

ఈ ఆయతులో సృష్టి కేవలం అల్లాహ్ మాత్రమే చేస్తాడని చెప్పబడింది.

"సృష్టించేవాడూ, అసలు ఏమీ సృష్టించనివాడూ ఉభయులూ సమానులేనా?" (నహ్ల్ : 17)

ఈ ఆయతులో సృష్టికర్త స్థాయికి సృష్టి చేరుకోలేదనే వాస్తవం స్పష్టం చేయబడింది. ఈ వాక్యం అద్వైత సిద్ధాంతాన్ని ఖండిస్తుంది. వారి వాదన ఏమిటంటే, సృష్టికర్త శక్తిగా ఉన్నప్పుడు, ఆ శక్తి నుండి కొంత పదార్థంగా మారినప్పుడు, సృష్టికర్త ప్రతి పదార్థంలోనూ ఉన్నాడు. ఈ వాదనలో, సృష్టికర్త స్వయంగా శక్తే అనే అపోహ తప్పు. సత్యం ఏమిటంటే, సృష్టికర్త వద్ద శక్తి ఉంది, దాని నుండి సృష్టికర్త పదార్థాన్ని సృష్టించాడు. ఖురాన్ ప్రకారం, సృష్టికర్త పదార్థం (matter), కాలం (time),  స్థలం (space) వెలుపల అర్ష్ (సింహాసనం)పై ఉన్నాడు. ప్రళయ దినమున అల్లాహ్ ప్రతి వస్తువును నాశనం చేసినప్పుడు కూడా, ఆయన పదార్థం, స్థలం వెలుపలే ఉంటాడు. ఈ పంక్తులలో ఇస్లామీయ ఏకదైవారాధన సిద్ధాంతాన్ని ఖురాన్ వెలుగులో వివరించడానికి ప్రయత్నం చేయటం జరిగింది. ❖




**ప్రతి సంవత్సరం జూలై 1న జాతీయ వైద్యుల దినోత్సవం జరుపుకుంటాం.** ఇది ప్రముఖ వైద్యుడు, పూర్వ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి డాక్టర్ బిధాన్ చంద్ర రాయ్ జయంతి. ఆయన దేశానికి వైద్యుడిగా, పాలకుడిగా అమూల్యమైన సేవలందించారు. ఈ రోజు మనం వైద్యుల సేవలను గుర్తించేందుకు, కృతజ్ఞతలు చెప్పేందుకు, అలాగే ఈ వృత్తిలో మారుతున్న దృక్పథాన్ని విశ్లేషించేందుకు ఒక మంచి అవకాశం. అయితే ఈ రోజున మనం ఒక అసలైన ప్రశ్న వేసుకోవాలి- ఒకప్పుడు సేవాభావంతో నడిచిన వైద్య వృత్తి, ఈ రోజు వ్యాపార ధోరణికి ఎలా మారిపోయింది?

అనాదికాలం నుండి సేవాసంకల్పమే మార్గదర్శకంగా వైద్యుడి పని కేవలం రోగాన్ని తగ్గించడమే కాదు- అతని బాధను తుడిచేయడం, అతనిలో నమ్మకాన్ని నింపడం, మరణం అంచుల దగ్గర నిలబడిన వ్యక్తికి జీవించాలనే ఆసరాను ఇవ్వడం కూడా.

పూర్వ కాలంలో వైద్యులు తమ సేవలకు ప్రతిఫలాన్ని ఆశించేవారు కాదు. ఋషులు ఆయుర్వేదాన్ని అభివృద్ధి చేశారు. సుశ్రత, చరక వంటి మునులు ప్రజల ఆరోగ్యాన్ని తమ ధర్మంగా చూశారు.

## గత కాల వైద్యుల ధర్మం - సేవే ధ్యేయం

**1. ప్రపంచ యుద్ధ కాలంలో కూడా -** వైద్యులు సరిహద్దుల్లో పనిచేసారు, విరిగిపోయిన శరీరాల్ని పట్టుకున్నారు, కళ్ళల్లో ప్రాణం నింపారు.

**2. గాంధీగారి కాలంలో -** దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో వైద్యులు ప్రజల ఆరోగ్యానికి తోడుగా నిలిచారు. ఉచిత వైద్యం, గ్రామ వైద్య కేంద్రాల ద్వారా సేవలందించారు.

**3. వ్యక్తిగత త్యాగాలు -** కొన్ని తరాలపాటు వైద్యుల కుటుంబాలు ఆదాయాన్ని దానంగా ఇవ్వటం చూశాం.

**ఇప్పటి వైద్య రంగం -** కాలం మారింది. విద్యాసంస్థలు ప్రైవేట్ అయ్యాయి. మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ పెరిగాయి. ఆరోగ్య రంగం కార్పొరేట్ కబంధ హస్తాల్లో పడిపోయింది. వైద్యులు కూడా మార్కెటింగ్ లక్ష్యాలకే బానిసలైపోతున్నారు.

అప్పటి ఆ సేవా దృక్పథం గాలికొదిలిపోయింది.

వైద్య రంగం కార్పొరేట్ రంగానికి తలవంచింది.

“పేషెంట్” అన్న మాట కంటే “కస్టమర్” అనే మాట ఎక్కువ వినిపిస్తున్నది.

ఆరోగ్యాన్ని చూసే కంటే బిల్లు వేసే ఉత్సాహం ఎక్కువగా కనిపిస్తున్నది.

అధిక నిర్దిష్ట పరీక్షలు అవసరం లేని సమయంలోనూ రాయటం,

అత్యవసరం కాని ఆపరేషన్లు సూచించడం, అధిక ఖర్చు చేసే మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ పై ఆధారపడటం, సామాన్యుడికి అందని చికిత్సల పథకాలు... ఇవన్నీ రోజువారీ దృశ్యాలుగా మారాయి.

### ఈ మార్పుల వెనుక ఉన్న ప్రధాన కారణాలు:

**1. వైద్య విద్య మోటు ధరలు** - ఒక ఎంబీబీఎస్ సీటు కోసమే 50 లక్షల నుంచి 1 కోటి వరకు ఖర్చవుతోంది. విద్యార్థి చదువు పూర్తయ్యాక ఆ ఖర్చు తీరాలి అంటే వ్యాపార దృక్పథమే తప్పదు.

**2. ద్వంద్వ నీతులు** - మందుల కంపెనీలు లాభాల కోసం వైద్యులపై ఒత్తిడి తెస్తున్నాయి. ప్రిస్కిప్షన్లలో వారి ఉత్పత్తులు మాత్రమే ఉండాలన్న ఒత్తిడితో వైద్యులు నిలకడగా ఉండలేకపోతున్నారు.

**3. అత్యవసర పరీక్షల అభివృద్ధి పేరుతో** - అవసరం లేని టెస్టులు, స్కాన్లు, బిల్లు జెనరేషన్ పనులు రోగికి భారం అవుతున్నాయి.

**4. వైద్యులపై నమ్మకం తగ్గిపోవడము** - దీనివల్ల రోగులూ డాక్టర్లను ప్రశ్నించేవారిగా మారుతున్నారు.

ఈ రోజుల్లో ఏం జరుగుతోంది? కొన్ని ఉదాహరణలు పెండింగ్‌లో ఉన్న ఆపరేషన్లు కావాలన్నవారికి ముందుగా డబ్బు అడుగుతున్నారు.

### రోగి ఆరోగ్యంపై కన్నా బీమా పాలసీపై ఆసక్తి చూపుతున్నారు

కమీషన్ మెడిసిన్స్ వ్యవస్థ విస్తృతంగా ఉంది. ప్రజలు వైద్యులను నమ్మలేని స్థితికి వచ్చారు. మానవతా విలువల స్థానంలో లాభాల లెక్కలు వచ్చాయి.

అయినప్పటికీ, దేశంలో చాలామంది వైద్యులు ఇంకా సేవాభావంతో పని చేస్తున్నారు.

గ్రామ వైద్యులుగా పని చేస్తూ, తమ సంపాదనను త్యాగం చేస్తున్నారు.

కొందరు యువ వైద్యులు సోషల్ మీడియా ద్వారా ఆరోగ్య అవగాహన కల్పిస్తున్నారు.

కరోనా సమయంలో సేవ చేసిన వేలాది మంది వైద్యుల త్యాగం మనం మరువలేం. చాలా మంది తమ ప్రాణాలను కూడా పణంగా పెట్టారు.

### ముందుకు పోవాల్సిన మార్గం

**1. వైద్య విద్యలో నైతిక విలువల బోధన** - "హిపోక్రటిక్ ఒత్"కు అర్థం నెరవేర్చే విధంగా వైద్య విద్యను మలచాలి.

**2. ప్రభుత్వ హాస్పిటల్స్ బలోపేతం** - సామాన్యులకు నాణ్యమైన ఆరోగ్యసేవలు అందించాలంటే ప్రభుత్వ రంగమే దారి చూపాలి.

**3. ప్రజల్లో ఆరోగ్య అవగాహన** - చిన్న సమస్యలకే పెద్ద హాస్పిటల్స్ ఆశ్రయించ కుండా, సరైన సమాచారం కలిగి ఉండాలి.

**4. వైద్యులు ప్రజా సేవకులు అన్న భావనను బలపరచే ప్రచారం** - పాఠశాల స్థాయిలోనే ఈ విలువలు నేర్పాలి.

వైద్యుని కళ్లల్లో దయ ఉండాలి, చేతుల్లో నైపుణ్యం ఉండాలి, మనసులో సేవా భావన ఉండాలి.

# అరుదైన గ్రూపు రక్తదాతల జాబితాతో పోర్టల్



భారతీయ వైద్య పరిశోధన మండలి(ఐసీఎంఆర్) ఆధ్వర్యంలో పని చేసే ముంబైలోని ఎన్ఐఐహెచ్ (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇమ్యూనోహెమటాలజీ) దేశవ్యాప్తంగా అరుదైన గ్రూపు రక్తం కలిగిన రక్తదాతల వివరాల జాబితాను సిద్ధం చేసింది. జాతీయ స్థాయిలో ఇలాంటి జాబితా తయారుచేయడం ఇదే తొలిసారి కాగా.. ఆ వివరాలతో "రేర్ బ్లడ్ డోనర్ రిజిస్ట్రీ ఆఫ్ ఇండియా" అనే పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఐసీఎంఆర్-ఎన్ఐఐహెచ్ అందుబాటులోకి తెచ్చిన ఈ రిజిస్ట్రీలో నెగెటివ్ గ్రూపుల రక్తం కలిగిన 600 మంది దాతలు, అత్యంత అరుదైన బ్లడ్ గ్రూప్ కలిగిన 250 మంది రక్తదాతల వివరాలు ఉన్నాయి. అలాగే, 170 మంది బాంబే బ్లడ్ గ్రూపు దాతల సమాచారం కూడా ఉంది. దీంతో అరుదైన బ్లడ్ గ్రూప్ కలిగి, తలసీమియా, సికిల్‌సెల్ వంటి వ్యాధులతో బాధపడుతున్న వారికి రక్తమార్పిడి అంశంలో ఈ పోర్టల్ వరప్రదాయిని కానుంది. రక్తనిధి కేంద్రాలు, దాతలు, రక్త నిల్వలు తదితర వివరాలను తెలియజేసేందుకు ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఈ-రక్తకోష్ ప్లాట్‌ఫామ్‌తో ఈ రేర్ బ్లడ్‌డోనర్ రిజిస్ట్రీని అనుసంధానం చేయాలని ఐసీఎంఆర్-ఎన్ఐఐహెచ్ ప్రస్తుతం ప్రయత్నిస్తున్నాయి.

హుమేరా అమీర్, ఏలూరు

# ఇస్లామ్‌లో క్షమాపణకు ఉన్న ప్రాధాన్యత

**"మిమ్మల్ని అల్లాహ్ క్షమించాలని మీరు కోరుకోరా? అల్లాహ్ గుణం ఏమిటంటే, ఆయన క్షమించేవాడు, కరుణించేవాడూను".**
**(దివ్య ఖుర్ ఆన్ 24:22)**

తోటి విశ్వాసులను క్షమించమని అల్లాహ్ ఆజ్ఞాపించాడు. అల్లాహ్ అనంత కరుణామయుడు, అమితంగా క్షమించేవాడు అని ఇస్లాం నొక్కి చెబుతుంది. అల్లాహ్‌కు ఉన్న 99 పేర్లలో అల్ గఫూర్ అనే నామానికి అత్యధిక ప్రాధాన్యత ఉంది. ''అల్ గఫూర్'' అంటే అమితంగా క్షమించేవాడని అర్థం. అల్లాహ్‌కే కనుక ఈ క్షమాగుణం లేనట్లయితే దైవానికి అవిధేయత చూపించిన ఇబ్లీస్‌కు ప్రళయం వరకు గడువు ఇచ్చేవాడు కాదు. మనిషిని కేవలం పరీక్ష కోసం పుట్టించినప్పటికీ అతని పాపపుణ్యాల లెక్క తీయడానికి ప్రళయం వరకు సమయం ఇచ్చేవాడు కాదు. అలాగే తన జీవిత పర్యంతం హాయిగా అనుభవించడానికి ఈ అనంత సృష్టిని మనిషికి దాసోహం చేసేవాడు కూడా కాదు. మనుషులు గానీ, జిన్నాతులు గానీ దైవానికి చూపించే అవిధేయతకు, వారు పాల్పడే దుశ్చర్యలకు వెంటనే ఎటువంటి శిక్షలు పడకపోవడానికి కారణం ఆ కరుణామయుడైన అల్లాహ్ క్షమాగుణం, అనంత కారుణ్యమే. ఈ క్షమాగుణం, కారుణ్యం కారణంగానే మానవులకు, జిన్నాతులకు ప్రళయం వరకు సమయం ఇవ్వడం జరిగింది.

దైవం స్వయంగా క్షమించేవాడు, అమిత దయగలవాడు. దైవం పట్ల మనిషి చేసిన పాపానికి సంబంధించి మాత్రమే కాకుండా, స్వతహాగా తప్పులు చేయడం అనేది మానవ సహజంగా ఉండే బలహీనత నుండి రక్షించడానికి కూడా ఈ క్షమాపణ అనే వరాన్ని అల్లాహ్ మనిషికి అనుగ్రహించాడు. విశ్వాసి పాపాలు ఎంత తీవ్రంగా ఉన్నప్పటికీ పశ్చాత్తాపపడి క్షమాపణ కోరమని అల్లాహ్ తన వైపునకు ఆహ్వానిస్తాడు. క్షమాపణ కోరడం అంటే వ్యక్తి తన గత చర్యలకు హృదయపూర్వక పశ్చాత్తాపం పొంది, తనలోని తప్పులను అంగీకరించడం, తదనంతరం ఆ విధమైన గత పాపకార్యాలను పునరావృతం కాకుండా ఉండటానికి దృఢమైన నిబద్ధతను కలిగి ఉండడం. విశ్వాసులు తమ పాపాలకు అల్లాహ్ నుండి క్షమాపణ కోరడం మాత్రమే కాదు ఇతరుల తప్పుల పట్ల తాము కూడా క్షమించే వైఖరిని అవలంభించాలి. ఒకరినొకరు తమ తప్పులకు క్షమించుకోవాలని కూడా ఆజ్ఞాపిస్తూ ఖుర్‌ఆన్‌లో 'క్షమాపణ' గురించి అనేకసార్లు చెప్పడం జరిగింది. ఒక విశ్వాసి తనకు అన్యాయం జరిగినప్పటికీ ఇతరులను క్షమించడం అంటే అది ఆ విశ్వాసిలోని సద్గుణంగా పరిగణించబడుతుంది. అతనిలోని సహనశీలతను ప్రతిబింబిస్తుంది. ఈ విధమైన చర్య ఆ విశ్వాసికి అల్లాహ్ న్యాయంపై ఉన్న నమ్మకాన్ని, ఆ వ్యక్తిలోని మానసిక బలాన్ని ప్రస్ఫుటం చేస్తుంది.

మానవులు సానుకూల, ప్రతికూల మనస్తత్వంతో సృజించబడ్డారు. ప్రతి మనిషిలోనూ కోపం, అసూయ, ద్వేషం, చిరాకు, పొగరు, అహంకారం మొదలైన ఎన్నో బలమైన భావోద్వేగాలు, అదుపులేని

కోరికలు కూడా ఉంటాయి. మనిషి మనస్తత్వం కారణంగానే ఒక్కోసారి తప్పులు చేయకుండా తప్పించుకోలేని పరిస్థితి వస్తుంది. ఇటువంటి మనస్తత్వం కారణంగా మనిషి జీవిత ప్రయాణంలో ఒక్కోసారి చాలా హానికరమైన ప్రభావాలను స్వయంగానూ అనుభవించాల్సి వస్తుంది, తన చుట్టూ ఉన్న వ్యక్తులపైన కూడా ప్రభావం పడుతుంది. మనిషి జీవితంలో జరిగే అన్ని రకాల తప్పులు ఉద్దేశపూర్వకంగా చేయబడవు, కానీ మనిషి తన ఇష్టానికి విరుద్ధంగా ఏదయినా జరిగినప్పుడు తనకు తాను నియంత్రణ కోల్పోయే పరిస్థితి వస్తుంది. ఇటువంటి సమయంలోనే మనిషికి సంయమనం, స్వీయ నియంత్రణ అనేది అవసరం. అదేవిధంగా దైవం ప్రసాదించిన అనుగ్రహాలను గుర్తించడం, వాటిని ఏ విధంగా ఉపయోగించాలో, ఏ విధంగా ఉపయోగించకూడదో, ఏ విధమైన ఉపయోగాల కోసం వాటిని దైవం ప్రసాదించాడో తెలియక, కేవలం మానవ సాఫల్యం కోసం మాత్రమే వాటిని దైవం ప్రసాదించాడని తెలియని పరిస్థితిలో మనిషిలో అహంకారం అనేది వస్తుంది.

మానవ జీవితం ప్రయోజనాలు, అప్రయోజనాలతో సృష్టించ బడింది. మనిషికి సంయమనం, స్వీయ నియంత్రణ అనేవి రావాలంటే అతనిలోని ప్రతికూల భావాలను ధీటుగా ఎదుర్కొనే ఒక ఆయుధం కావాలి. Prevention is better than Cure అనే ఒక నానుడిని అనుసరించి మనిషి మన భావోద్వేగాలపై నియంత్రణ కోల్పోయి, తప్పు జరిగిపోయి, ఆ తర్వాత జరిగిన తప్పుకు పశ్చాత్తాపపడడం కంటే ముందుగానే తన మనసుకు నచ్చచెప్పుకోవడం చాలా అవసరం. అదే "క్షమాపణ". దీన్నే మహా ప్రవక్త (స) తన జీవిత పర్యంతం ఆచరించి చూపించారు. దైవప్రవక్త(స) ద్వారా మాత్రమే కాదు గత ప్రవక్తలందరి ద్వారా కూడా దైవం ఈ క్షమాపణ ద్వారానే మానవాళి సాఫల్యం పొందే మార్గాన్ని సులభం చేసి చూపించాడు.

మనిషి తన భావోద్వేగాలను నియంత్రించుకుని, కోపాన్ని దిగమింగి, ముందుగానే తన మనసుకు నచ్చజెప్పాలంటే మనిషి రెండు విషయాలపై దృష్టి పెట్టాలి. ఒకటి తనకు జరిగిన లేదా జరుగుతున్న అన్యాయానికి దైవం తప్పకుండా తనకు ప్రతిఫలం ఇస్తాడని, తనకు జరిగే అన్యాయానికి దైవం ఖచ్చితంగా న్యాయం చేస్తాడనే ఉద్దేశ్యంతో దైవన్యాయం పై నమ్మకం పెట్టాలి. రెండవది హృదయాలను కఠినతరం చేసుకోవడం, మానవ సంబంధాల విచ్ఛిన్నం అనేది దైవానికి నచ్చని పని. అందువల్ల మానవ సంబంధాల విచ్ఛిన్నానికి తాను స్వయంగా కారణం కాకూడదనే స్పృహ కలిగి ఉండాలి. అటువంటి స్పృహ కలిగి నప్పుడు మాత్రమే ఇతరులను క్షమించగలుగుతారు.

**"వారు కలిమిలో, లేమిలో, ఏ స్థితిలో ఉన్నా తమ సంపదను ఖర్చుచేసేవారు, కోపాన్ని దిగమ్రింగేవారు, ఇతరుల తప్పులను క్షమించేవారు - ఇలాంటి సజ్జనులంటే అల్లాహ్‌కు ఎంతో ఇష్టం. వారి స్థితి ఎలా ఉంటుందంటే, ఎప్పుడైనా ఏదైనా అశ్లీలకార్యం వారి వల్ల జరిగిపోతే లేదా ఏదైనా పాపం చేసి, వారు తమ ఆత్మలకు అన్యాయం చేసుకున్నట్లయితే, వెంటనే వారికి అల్లాహ్ జ్ఞాపకం వస్తాడు. అప్పుడు వారు ఆయనను తమ తప్పులు క్షమించు అని వేడుకుంటారు - ఎందుకంటే అల్లాహ్ తప్ప పాపాలను క్షమించగలిగే వాడెవడున్నాడని - వారు తాము చేసిన తప్పులను గురించి బుద్ధిపూర్వకంగా మొండివాదం చెయ్యరు. అలాంటి వారికి తమ ప్రభువు వద్ద లభించే ప్రతిఫలం ఏమిటంటే, ఆయన వారిని క్షమిస్తాడు. క్రింద సెలయేళ్ళు ప్రవహించే ఉద్యానవనాలలోకి వారిని ప్రవేశింపజేస్తాడు. వారు అక్కడ శాశ్వతంగా ఉంటారు. మంచిపనులు చేసేవారికి ఎంత చక్కని ప్రతిఫలం"! (దివ్య ఖుర్ఆన్ 3: 134, 135, 136)**

క్షమాగుణానికి ఇస్లాంలో అత్యంత ప్రాధాన్యత ఉంది. క్షమాపణ అనే భావన ఇస్లామిక్ బోధనలలో కేంద్ర స్థానాన్ని ఆక్రమిస్తుంది. క్షమాగుణాన్ని దైవిక లక్షణంగా, ఆత్మశుద్ధికి, ఆధ్యాత్మిక వృద్ధికి మార్గంగా పరిగణిస్తుంది ఇస్లాం. క్షమాపణ అనేది క్షమించబడిన వ్యక్తికి మాత్రమే కాదు, క్షమించే వ్యక్తికి కూడా, అంతర్గత శాంతిని ప్రసాదిస్తుంది, భావోద్వేగాల నియంత్రణను కలుగజేసి, తద్వారా వారికి మనశ్శాంతిని కలుగజేస్తుంది. ఇతరులను క్షమించి నందుకు గానూ క్షమించే వారికి అల్లాహ్ ప్రతిఫలం ఇస్తాడని ఇస్లాం బోధిస్తుంది. క్షమాపణ కారణంగా మనిషి జీవితంలో ఆధ్యాత్మిక వృద్ధి కలుగుతుంది, శారీరక, మానసిక వికాసం కలుగుతుంది, తద్వారా వ్యక్తులు అల్లాహ్‌కు దగ్గరవుతారు. ఒక వ్యక్తి తన క్షమాగుణం ద్వారా కేవలం తన కుటుంబంలోనే కాదు తన చుట్టూ ఉన్న సమాజంలో కూడా ఆరోగ్యవంతమైన సంబంధాలను పెంపొందించడంలో సహాయపడతాడు. దాని కారణంగా సామాజిక సామరస్యాన్ని ప్రోత్సహించడంలో "క్షమాపణ" కీలక పాత్ర పోషిస్తుంది. ఇద్దరు వ్యక్తుల మధ్య గానీ, రెండు వర్గాల మధ్య గానీ సంఘర్షణలు తలెత్తినప్పుడు, ఈ "క్షమాపణ" అనే అస్త్రం ద్వారా సయోధ్య కుదిర్చి విభేదాల నుండి స్వస్థత పరచడానికి, విచ్ఛిన్నమైన సంబంధాలను పునరుద్ధరించడానికి మార్గం సుగమం అవుతుంది.

(ఓ ప్రవక్తా!) ఇలా అను, "మీ ఆత్మలకు అన్యాయం చేసుకున్న నా దాసులారా! అల్లాహ్ కారుణ్యం పట్ల నిరాశ చెందకండి. నిశ్చయంగా అల్లాహ్ అన్ని పాపాలనూ క్షమిస్తాడు. ఆయన క్షమించేవాడు, కరుణించే వాడూను. (దివ్య ఖుర్ ఆన్ 39:53).

**(మిగతా వచ్చేవారం)**




**నియమబద్ధంగా జీవించడం కష్టమైన పనేం కాదు!** మనసు పెడితే అందరికీ సాధ్యమయ్యేదే!! అందుకోసం కొండల్ని త్రవ్వాల్సిన పనిలేదు. సప్త సముద్రాలు దాటాల్సిన అవసరం అంతకన్నా లేదు! మరేం చేయాలి? మనలోకి మనం తొంగి చూసుకోవాలి. మన తప్పులను మనం తెలుసుకోవాలి. వాటిని అంగీకరించాలి. ఆ తర్వాత సంస్కరించుకోవాలి. మారిన మనసే ప్రశాంత ఆత్మ, నెమ్మదించిన మనసు. మానసిక పరివర్తన పొందిన మనిషే మహోన్నతుడు! సత్ ప్రవర్తనను అలవర్చుకోవడం ఆధ్యాత్మిక సాధనలో తొలి సోపానం. ఆ తర్వాత సాగించే ప్రయాణంలో అల్లాహ్ సంరక్షకుడిగా వెంట ఉంటాడు. అలాంటి శుభాత్మ కలిగిన వారిని ప్రేమ పవిత్రుడైన ప్రభువు తన స్వర్గ వనాల వైపు పిలుస్తున్నాడు:

(ఇక సత్యాన్ని విశ్వసించి సదాచార సంపన్నుడయిన మనిషిని ఉద్దేశించి) "తృప్తి చెందిన మనసా! పద నీ ప్రభువు సన్నిధికి. నీవు ఆయన పట్ల సంతోషించావు, ఆయన నీ పట్ల ప్రసన్నుడ య్యాడు. (ఇక) నా పుణ్యదాసులలో చేరి నా స్వర్గంలో ప్రవేశించు" అని చెప్పడం జరుగుతుంది. (అల్-ఫజ్ర్: 27-30)

ఒక ఉన్నత స్థాయి గల వ్యక్తి రోజూ నిష్ఠగా అయిదు పూటల నమాజు, ఖుర్ఆన్ పారాయణం చేసేవాడు. వీలు కుదిరినప్పు డల్లా నియమబద్ధంగా మక్కా మదీనాలకు వెళ్ళేవాడు. అయిదేళ్లకు ఒకసారి హజ్జ్‌కు వెళ్లడం అతనికి ఉన్న మంచి అలవాటు. కానీ, ఆయన ముక్కోపి. రోజూ భార్యను, పిల్లల్ని కొడుతూ ఉండేవాడు. బంధుమిత్రులతో దురుసుగా ప్రవర్తించేవాడు. అతని స్నేహితులు అసహనంతో 'ఇంకేం లాభం! నమాజు, ఖుర్ఆన్ పారాయణం, హజ్జ్ ఉమ్రాలు మానేయొచ్చు కదా!' అనేవారు. కానీ ఆ ప్రబుద్ధుడు 'లేదు! లేదు! వాటిని ఎలా మానతాను? అవి నా ఆరోగ్యానికి, ఆధ్యాత్మిక ఉన్నతికి ఎంతో ఉపయోగపడతాయి' అనేవాడట. కారణం - దైవ హక్కుల నిర్వర్తన ఎంత అవసరమో, దైవ దాసుల హక్కుల నిర్వహణ కూడా అంతే అవసరం అన్న విషయం అతనికి తెలియకపోవడమే.

దైవప్రవక్త(స) తన అనుచరుల (సహాబా)తో "ముఫ్లిస్ (దరిద్రుడు) (ఏ ఆధారము లేనివాడు) ఎవరు?" అని ప్రశ్నించారు. సహాబా (రజి) దానికి సమాధానంగా "తన వద్ద దిర్హమ్, దీనార్ లేనివాడు" అని అన్నారు. అది విని ప్రవక్త ముహమ్మద్ (స) "కాదు, ప్రళయ దినాన నమాజ్, ఉపవాసం, సదఖాల వంటి తిహామా పర్వతాలు వంటి పుణ్యాలు తీసుకొని వస్తాడు. కానీ అతను ఇతరులను తిట్టి ఉంటాడు, ఇతరులపై అపనిందలు మోపి ఉంటాడు, ఇతరులను కొట్టి ఉంటాడు, ఇతరుల సంపదను అన్యాయముగా అనుభవించి ఉంటాడు. ప్రళయ దినాన లెక్కల ఘడియ ఆసన్నమైనప్పుడు, అతనిచే బాధింపబడిన వారందరు తమతమ హక్కు కొరకు హాజరవుతారు. వారి వారి హక్కులకు సరిపోవు అతని పుణ్యఫలములో నుండి ఇప్పించబడుతుంది. చివరికి

అతని పుణ్యాలన్నియు ఖాళీ అవుతాయి. తరువాత వారి పాప భారము ఇతనిపై వేయబడుతుంది. తరువాత అతనిని నరకములో త్రోయటం జరుగుతుంది. ఇటువంటి వ్యక్తిని ముఫ్లిస్ (దరిద్రుడు), (ఏ ఆధారము లేనివాడు) అని అంటారు'' అని మహనీయ ముహమ్మద్ (స) వివరించారు. (ముస్లిం)

దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు : నరకానికి ఎవరు (లేక) నరకం ఎవరిపై నిషిద్ధమో నేను మీకు తెలుపనా? ప్రజలతో సన్నిహితంగా ఉంటూ సౌకర్యాన్ని కలగజేస్తూ, మృదుత్వం మార్దవాలతో వ్యవహరించే ప్రతి వ్యక్తిపై నరకం నిషిద్ధమే. (తిర్మిజీ దీనిని ఉల్లేఖించి 'హసన్'గా పేర్కొన్నారు) (సుననె తిర్మిజీ)

సన్నిహితంగా ఉండటమంటే తమ నడవడికతో, మంచి ప్రవర్తనతో ప్రజల హృదయాల్లో చోటు సంపాదించుకోవటమని అర్థం. అదేవిధంగా సౌకర్యాన్ని కలుగజేస్తూ మృదువుగా వ్యవహరించటమంటే ప్రాపంచిక వ్యవహారాల్లో వారిపట్ల అణకువతో, ప్రేమతో వ్యవహరించటమని భావం. ఈ హదీసులో కూడా ఉత్తమ నడవడికకు గల గొప్పదనం వివరించబడింది. దీనికి విశ్వాసంతో ప్రగాఢమైన సంబంధముంది. మనిషిని నరకాగ్ని నుంచి కాపాడేది ఆ విశ్వాసమే. అంటే 'కట్టుకున్న భార్యను, ఇంట్లో పిల్లల్ని ప్రేమించకుండా, ఇతరులతో సౌమ్యంగా మెలగకుండా మనం ఎన్ని సాధనలు, ప్రార్థనలు చేసినా ఫలితం ఉండదు. ముందు మన ప్రవర్తనను మార్చుకోవాలి.

దైవభక్తి, ధర్మనిరతిది అవినాభావ సంబంధం. ఒకటి పెరిగితే, సమస్థాయిలో రెండోదీ పెరుగుతుంది. పాపభీతి, ధర్మనిరతి కవలల్లాంటివి. ఈ రెంటికీ ఒక దానితో మరో దానికి విడదీయరాని సంబంధం ఉంది. దైవప్రీతి పెరిగే కొద్దీ పాపభీతి కూడా పెరుగుతుంది. అలాగే ,పాపభీతి కలిగే కొద్దీ దైవప్రీతి పెరుగుతుంది. అందుకే 'మృదుత్వం, సరళత'- ఈ రెండూ దైవభక్తి గలవారి జీవితాన్ని నడిపించే ప్రధాన సూత్రాలు. ధర్మాన్ని తప్పి ప్రవర్తించే వారు ఎన్ని ప్రార్థనలు చేసినా ఫలితం శూన్యమే.

## సద్వర్తనే సాధన

విశ్వాసం అంటే నోటితో పలకడం, మనసుతో సత్యం అని అంగీకరించడం, శరీరావయవాలతో క్రియారూపం ఇవ్వడం. కానీ సమాజంలో చాలామంది తమ సాధనలన్నిటినీ, ఆరాధనలన్నింటిని యాంత్రికంగా మారుస్తున్నారు. సాధనలు, ఆచారాలు, ఆరాధనలు వీటన్నిటి వెనుక ఉన్న జ్ఞానాన్నీ, తత్వాన్నీ అర్థం చేసుకోకుండా, నిత్యజీవన ప్రవర్తనతో అన్వయించుకోకుండా మొక్కుబడిగా ముగించేస్తుంటారు. మనసులో దయ, కరుణ, ప్రేమ పెంచుకోకుండా ఆచరించే ప్రార్థన బూడిదలో పోసిన పన్నీరే! 'కోపం, మూర్ఖత్వం, కపటం, అసూయ, అహంకారం, చెడు ఆలోచనలు తదితరమైనవి అపరిశుద్ధ మనో లక్షణాలు. శాంతం, సహనం, ప్రేమ, కరుణ, సేవాభావం గల మనస్సులే పరిశుద్ధమైనవి. మనం సంప్రదాయ, ఆచార వ్యవహారాల నుంచి లోతుగా వెళ్లాల్సిన అవసరం ఉంది. అయితే ముస్లిం సమాజంలో ఇంకా చాలా మంది ధార్మిక విషయాలకు సంబంధించిన ప్రాథమిక అవగాహనలోనే ఉన్నారు. కొందరు మేధావులు, పండితులు కూడా మతాన్ని కొన్ని ఆరాధనలకు, ఆచారాలకే పరిమితం చేస్తున్నారు. ఇస్లాం ధర్మం సంపూర్ణమయినది, జీవిత అన్ని కోణాల్లో మనిషికి కావాల్సిన మార్గదర్శకత్వాన్ని అది పరిపూర్ణ స్థాయిలో అందిస్తుంది.

## మనకెందుకులే అనుకుంటే పొరపాటే

అధర్మాన్ని ఎదుర్కోవటం, అసత్యాన్ని పారదోలడం, అన్యాయాన్ని ప్రశ్నించడం, అక్రమాన్ని అడ్డుకోవడం కూడా ఆధ్యాత్మిక ఉన్నతే! ధర్మోద్ధరణలో భాగమే! కళ్ళ ముందు జరుగుతున్న అధర్మాన్ని, అన్యాయాన్ని అడ్డుకోకపోతే ఎలాంటి తీవ్ర పరిణామాల్ని ఎదుర్కోవాల్సి ఉంటుందో తెలుసుకోవడానికి దైవప్రవక్త (స) వారి ఈ హెచ్చరికే సాక్ష్యం. ''ఎవని చేతిలో నా ప్రాణం ఉందో ఆయన సాక్షిగా చెబుతున్నాను- మీరు మంచిని బోధించనయినా బోధించాలి. లేదా చెడు నుండి వారించనయినా వారించాలి. ఇలా గనక మీరు చేయకపోతే అల్లాహ్ శిక్ష మీ మీద విరుచుకుపడే ప్రమాదం ఉంది. అప్పుడు మీరు ప్రార్థించినా, ప్రాధేయపడినా మీ ప్రార్థనలు స్వీకరించబడవు''. (తిర్మిజీ)

'ధర్మం అధర్మం వల్ల బాధకు లోనై తీర్పు కోసం వస్తే, దాన్ని తీర్చని సభ్యులు అధర్మం కారణంగా బాధపడాల్సి వస్తుంది. భయం, బెరుకు విడిచి అధర్మాన్ని అడ్డుకోవాలి అంటున్నారు ప్రవక్త (స). మీలో ఎవరయినా ఒక చెడును చూస్తే వీలైతే దాన్ని చేతి (బలం)తో ఆపాలి. లేదా నోటి (కలం)తో వారించాలి. అదీ సాధ్యపడకపోతే దాన్ని మనస్సులోనయినా తప్పుగా భావించి అసహ్యించుకోవాలి. ఇది విశ్వాసపు అత్యల్ప స్థాయి. (ముస్లిం)

నేటి సమాజంలో కూడా అనేక సందర్భాల్లో మన ప్రవర్తన, ప్రతిస్పందన కూడా ఒకనాటి ప్రజల తీరును తలపిస్తూ ఉంటాయి. వారిని గురించి ఖుర్ఆన్ ఇలా అంటుంది: ఇస్రాయీల్ సంతతిలో సత్యాన్ని తిరస్కరించినవారు దావూద్ నోట, మర్యం కుమారుడు ఈసా నోట శపించబడ్డారు. దానికి కారణం వారు అవిధేయులయి హద్దుమీరి ప్రవర్తించడమే. అదీగాక వారు ఒకర్నొకరు చెడుల నుండి వారించుకునేవారు కాదు. నిస్సందేహంగా వారు చాలా చెడ్డపని చేశారు. (అల్-మాయిదహ్: 79)

(మిగతా వచ్చేవారం)




# నమాజ్, సహనం ద్వారా దైవ సహాయం

- నసీరా బేగం

**మనిషి** పరిస్థితి కూడా చాలా విచిత్రంగా ఉంటుంది. అతను ఏదైనా ఆపదకు గురైతే అతనిని ఇష్టపడేవారు, అతని సంబంధీకులు, అతని స్నేహితులు అతనికి సహాయపడుతూ ఉన్నంత కాలం అతని దృష్టి ఆ సహాయం చేసేవారిపై కేంద్రీకృతమైపోతుంది. వీరందరూ ఉండగా నేను భయపడే అవసరమేముంది అని అతనికి కొండంత ధైర్యం వచ్చేస్తుంది. అప్పుడు అతని దృష్టి సృష్టికర్తపై అంతగా ఉండదు. కాని కొన్నిసార్లు అతను ఏదైనా ఆపదకు, కష్టానికి గురై అతని స్నేహితులు, సంబంధీకులు అందరూ అతనికి ఆ ఆపద లోనే వదలివేస్తే, సహాయానికి చెయ్యి అందించకపోతే అప్పుడు అతనికి వెంటనే సృష్టికర్త, పాలకుడు, పోషకుడు అయిన ప్రభువు తప్పకుండా జ్ఞాపకం వస్తాడు. మనిషి వైఖరి ఈ విధంగా ఉన్నప్పుడు ఒక ప్రశ్న తప్పకుండా తలెత్తుతుంది. ఏమిటి ప్రజలు సహాయపడుతూ ఉన్నప్పుడు అతని యజమాని ప్రభువు అల్లాహ్ కాదా? అందరూ అతనిని ఒంటరిగా, ఏకాకిగా వదలివేసినప్పుడే అల్లాహ్ అతని యజమానియా? అతని ప్రభువా అని. ఒకవేళ అతని పరిస్థితి ఇలా ఉన్నట్లయితే తప్పకుండా అతని విశ్వాసం ప్రమాదంలో ఉన్నట్లే.

వాస్తవానికి ఒక విశ్వాసి దృష్టి సహాయపడే ఎన్ని చేతులు ఉన్నా, ఎంత మంది ఉన్నా అతని దృష్టి అంతా కేవలం అల్లాహ్‌పైనే ఉండాలి. అందరికంటే ముందు ఆయన్నే సహాయపడమని అర్థించాలి. ఇదే సరైన పద్ధతి. అలాంటి పరీక్షల పరిస్థితులలో అల్లాహ్ నమాజ్, సహనం ఈ రెండింటి ద్వారా తనను సహాయం కోసం అర్థించాలని బోధించాడు. ఈ విషయాన్ని అల్లాహ్ తన గ్రంథంలో ఇలా సెలవిచ్చాడు. **“విశ్వాసులారా! సహనం ద్వారా, నమాజు ద్వారా సహాయం అర్థించండి. సహనం కలవారికి అల్లాహ్ తోడుగా ఉంటాడు.” (2: 153)**

మనిషికి ఖుర్‌ఆన్ గ్రంథం ఈ రెండు సూత్రాలను ఇచ్చింది. దీనిద్వారా మనిషి తన ఇహపరలోకాలను సరిదిద్దుకోగలుగు తాడు. కష్టాల నుంచి కడగండ్ల నుంచి, దుఃఖాల నుంచి గట్టెక్కగలుగుతాడు. మొట్టమొదట దాని కోసం అతనికి అల్లాహ్‌పై పూర్తి నమ్మకం తప్పకుండా కలిగి ఉండాలి. అకస్మాత్తుగా ఏదైనా ఆపద వచ్చి పడినప్పుడు, దుఃఖం ఆవహించినప్పుడు, ఏదైనా విషయం చుట్టుముట్టినప్పుడు, ఏదైనా అవసరం వచ్చి పడినప్పుడు వెంటనే అతను నేను ఈ సమయంలో తప్పకుండా సహనం వహించాలి అనే గట్టి సంకల్పాన్ని కలిగి ఉండాలి. ఆ తరువాత ఈ సంకల్పానికి బలం చేకూర్చడానికి, అల్లాహ్ సహాయాన్ని అర్థించడానికి అతను నమాజ్ చెయ్యటం తప్పనిసరి. నమాజు ద్వారా దాసుడు ప్రభువునకు అత్యంత సమీపంగా చేరిపోతాడు. సాధారణంగా మనం చూసే విషయమేమిటంటే, మనిషి కష్ట దుఃఖాలలో తన వారికి దగ్గరైనప్పుడు, తన వారి సామీప్యం ద్వారా అతనికి ధైర్యం వచ్చేస్తుంది. వెంటనే అతను తన వారిని కౌగిలించుకుంటాడు. ఆ తరువాత వెక్కి వెక్కి ఏడుస్తాడు. ఈ విధంగా చేసినప్పుడు అతని గుండె బరువు తగ్గిపోతుంది. అప్పుడు అతను తన వారితో తన కష్టాలన్నింటినీ పంచుకుంటాడు. ఆ తరువాత అతను సహాయం కోసం ఆశతో వారి వైపు చూస్తాడు. ఇది వింత విషయమేమీ కాదు. ఇది అతని స్వభావంలో ఉన్న విషయం. కాని ఇందులో సాధారణంగా జరిగే విషయమేమిటంటే, ఏ ఆశతోనైతే అతను ఇతరుల వైపు దృష్టి సారిస్తాడో అతనికి పలుమార్లు నిరాశే ఎదురవుతుంది.

కాని అతను గనక ఇదేవిధంగా ఆపద సమయంలో అల్లాహ్‌కు దగ్గరైపోతే, అతను వెంటనే నమాజులో నిలబడిపోతే అతనికి కొండంత ధైర్యం వచ్చేస్తుంది. నమాజులో అతను చేసే రుకూ ద్వారా నేను నీ దాసుడను, నీవు నా ప్రభువువి, నీవు అత్యంత శక్తిమంతుడవు. కనుక నేను నీ ముందు వంగిపోయాను. నీవే నా ఆపద నుంచి నన్ను కాపాడుకుంటావు అనే నమ్మకంతో ఉన్నాను అనే భావన కలుగుతుంది. ఇంకా అతని హృదయాంతరాళాల్లో  నుంచి ఈ భావనను ఎలుగెత్తి చాటుతున్న ఒక పిలుపు అతనికి వినిపిస్తుంది. ఆ తరువాత అతను సజ్దా చేసినప్పుడు, అతను  సహనంతో అతని హృదయంలో నియంత్రించుకుంటూ ఉన్న దుఃఖం కట్టలు తెంచుకుని కన్నీళ్ల ద్వారా ప్రవహిస్తుంది. అతనికి సజ్దాలో తన ప్రభువుకు అత్యంత సమీపమైపోయాననే భావన గాఢంగా కలుగుతుంది. నాకూ, నా ప్రభువుకు మధ్య ఎవరూ లేరు, ఏ వస్తువూ లేదు, నా ప్రభువు నుంచి నాకు ఎవ్వరూ దూరం చెయ్యజాలరు అనే ఒక ప్రీతికరమైన మధురానుభూతి  అతనికి కలుగుతుంది. అప్పుడు అతను తన ప్రభువుకు తన కష్టదుఃఖాలన్నీ చెప్పుకుంటూ వెక్కి వెక్కి ఏడుస్తాడు. తన గుండె బరువు మొత్తాన్ని దించివేస్తాడు. ఆ తరువాత దృఢమైన నమ్మకంతో, ఎంతో ఆశతో అల్లాహ్ వైపునకు చూస్తాడు. అల్లాహ్ కారుణ్య ప్రభువు కాబట్టి అతను పెట్టుకున్న ఆశలను తప్పకుండా నెరవేరుస్తాడు. కష్ట దుఃఖాలలో చేసే నమాజుకు, సహనానికి అతనికి ప్రతిఫలం తప్పకుండా లభిస్తుంది. ఈ అనుభూతిని ఒకసారి చవిచూసిన  దాసుడు ఎల్లవేళలా ఇదే అనుభూతిని పొందుతూ ఉండాలని ఆశపడతాడు.  ఎందుకంటే ఆ అనుభూతిలో ఉండే రుచియే వేరు. ఆ ధైర్యమే వేరు. ఆ శాంతియే వేరు. కనుక నిజమైన దాసునిపై కష్టాలు, కడగండ్ల పర్వతాలు విరుచుకుపడుతున్నా అతని నోటి నుండి ఎలాంటి ఫిర్యాదు మాటలు వెలువడవు.  అవి కూడా తన జీవితానికి సంబంధించిన కొన్ని ఘట్టాలు అని నమ్ముతాడు.

సాధారణ ప్రజలు చిన్నచిన్న కష్టాలకు, చిన్న చిన్న దుఃఖాలకు, చిన్న చిన్న పరీక్షలకే భయపడిపోతారు. బాధపడిపోతారు. ప్రపంచంలో అందరూ సుఖంగా ఉన్నారు. ఈ పరీక్షలన్నీ నాకే ఎదురవుతున్నాయని వాపోతూ ఉంటారు. కానీ తెలుసుకోవలసిన విషయమేమిటంటే ఈ పరీక్షలకు, ఈ కష్టాలకు, ఈ దుఃఖాలకు ఎవరూ అతీతులు ఎంతమాత్రమూ కారు. సాధారణ ప్రజలకు చిన్న చిన్న పరీక్షలే ఎదురవుతాయి. విశ్వాసులకు కఠిన పరీక్షలు ఎదురవుతాయి. అంతకంటే అధిక పరీక్షలు దైవప్రవక్తలకు ఎదురయ్యాయి. వాటికి సంబంధించిన ఎన్నో ఉదాహరణలు మన ముందున్నాయి.

ఉదాహరణ దైవప్రవక్త హజ్రత్ ఇబ్రాహీమ్(అ) సత్యసందేశాన్ని ప్రకటించినప్పుడు ఆ కాలపు రాజు, ప్రజలు కూడా తిరగబడ్డారు. ఆయన్ని అగ్నికి ఆహుతి చెయ్యటానికి ప్రయత్నించారు. వారి ప్రయత్నం ఫలించనప్పుడు, దేశం నుంచి బహిష్కరించారు. ఆయన సహనంతోనే అన్నీ భరించారు. దైవ సందేశాన్ని ప్రజలకు అందిస్తూనే ఉండేవారు. చివరకు అల్లాహ్ పెట్టిన పరీక్షలను కూడా సహనంతో మనో నిబ్బరంతో పూర్తి చేశారు.

హజ్రత్ ఇస్మాయీల్(అ)ను ఎన్నుకున్న అల్లాహ్ బాల్యం నుంచే పరీక్షించదలించాడు. ఆయన కూడా సహనంతో అల్లాహ్ ప్రీతి కోసం వాటిని ఎదుర్కొన్నారు.

హజ్రత్ యాఖూబ్(అ) ఎదుర్కొన్న పరీక్షలు కూడా సాధారణమైనవేవీ కావు. ముఖ్యంగా ఆయన గారి ప్రియ పుత్రుడు హజ్రత్ యూసుఫ్(అ)పై చేసిన దారుణానికి కూడా ఆయన సంవత్సరాల తరబడి సహనం వహించారు.

హజ్రత్ యూసుఫ్(అ)ను బావిలో పడవేసినప్పటి నుంచి రాజ దర్బారుకు చేరేవరకు సంవత్సరాల తరబడి ఆయన ఎదుర్కొన్న పరీక్షలు కూడా మామూలువి కావు. ఆయన కూడా సహనంతోనే, మనో స్థైర్యంతోనే వాటిని ఎదుర్కొన్నారు.

హజ్రత్ అయ్యూబ్(అ) గారు వ్యాధికి గురైనప్పుడు తనవారు దూరమైపోయారు. తన సంపద అంతా దూరమైపోయింది. వ్యాధి బాధ ఆవహించింది. అయినా కూడా ఆయన సహనాన్నే వహించారు.

చివరకు దైవప్రవక్త ముహమ్మద్(స) కూడా  దైవ సందేశ కార్యక్రమాన్ని  మొదలుపెట్టిన రోజు నుంచే పరీక్షలు చుట్టుముట్టాయి. ఆయన(స) పరీక్షలన్నీ చివరి వరకు సహనంతోనే ఎదుర్కొన్నారు.

ఈ విధంగా దైవప్రవక్తలందరూ కూడా కష్టాలను, దుఃఖాలను, పరీక్షలను ఎదుర్కొన్నవారే. కాని వారు ఏనాడూ అసహనాన్ని ప్రదర్శించలేదు. ఒక్క క్షణం కూడా అల్లాహ్ నుంచి దూరం కాలేదు. కనుకనే చివరికి వారికి ఇహలోకంలో కూడా దాని ప్రతిఫలం లభించింది. పరలోకంలోనైతే వారి స్థానాలు ఎంతో మహోన్నతంగా ఉంటాయి. ఈనాడు కూడా మనం వారి అడుగుజాడలలో సహనంతో జీవించినట్లయితే అల్లాహ్ తప్పకుండా మనకు కూడా మంచి ప్రతిఫలాన్ని ప్రసాదిస్తాడు. ❖




**ముహమ్మద్ హనీఫ్, మార్కాపురం**

**ఒక దేశం అభివృద్ధి విద్యా వ్యవస్థ మీద ఆధారపడి ఉంటుంది.** అది బాగుంటే అన్ని వ్యవస్థలు సరైన దారిలో వెళ్తాయి. నేటి సమాజంలో చదువకున్న వ్యక్తి ఎక్కడికి పోయినా ఎలాగైనా జీవించగలడు. ఎందుకు అంటే అతని దగ్గర చదువుతోపాటు తెలివితేటలు కూడా ఉంటాయి. ఆ చదువు పది మందికి నేర్పిస్తాడు. అతని దగ్గర ధనం దొంగిలించవచ్చు కాని అతని జ్ఞానాన్ని ఎవరూ దొంగిలించలేరు. అందుకే ప్రతి తల్లిదండ్రులు బిడ్డపుట్టిన 4-5సంవత్సరాలకే ఒక ప్రణాళిక సిద్ధం చేసుకుంటారు. మా అబ్బాయి చదివి పెద్ద ప్రయోజకుడు కావాలి అని అహర్నిశలు కష్టపడటానికి సిద్ధం అవుతారు. వారి గురించి వారి చదువు గురించి తపన పడతారు. ఎవరి స్థోమతనుబట్టి వారు స్కూల్‌లో జాయిన్ చేస్తారు. ఇక్కడి నుంచి పిల్లల చదువు మొదలవుతుంది.

ఉపాధ్యాయులు పిల్లల మనసులో ఉన్న భయాన్ని దూరం చేస్తూ పోవాలి. ఉపాధ్యాయులు స్కూల్‌లో మంచిగా వారికి ఒకటికి రెండుసార్లు అర్థమైనరీతిలో తెలపాలి. పిల్లల మనసులో కూడా ఎన్నో ప్రశ్నలు వస్తుంటాయి. వాటిని ఓర్పుతో టీచర్ కాని ఇంట్లో తల్లిదండ్రులు కాని సమాధానం ఇవ్వటానికి ప్రయత్నించాలి. వారి మీద కసురుకోకూడదు. అలా చెయ్యటం వల్ల రెండవసారి మీ దగ్గరకు రారు. వారిని ఎంతో ప్రేమతో దగ్గరకు తీసుకుని వారికి అర్థంకాని విషయాలను అర్థమయ్యే రీతిలో తెలపాలి. అప్పుడే పిల్లలు సామాజిక సంబంధాలు ఏర్పరచుకోగలుగుతారు. పిల్లల్లో కూడా రెండు రకాల మనసులు కనబడతాయి. ఒక రకమైన పిల్లలు అల్లరి చేస్తారు. కాని చదువులో మాత్రం బాగా చదువు తారు. ఒక రకమైన పిల్లలు ఎప్పుడు చదువు మీద ధ్యాస వేరేది ఏమీ ఉండదు. చూడటానికి బాగానే చదువుతున్నట్టే ఉంటారు కాని మార్కులు మాత్రం తక్కువ వస్తాయి. అలాంటి వారిని నెమ్మదిగా హ్యాండిల్ చెయ్యాలి. పిల్లలు ప్రోగ్రెస్ రిపోర్ట్‌తో తల్లిదండ్రుల దగ్గరకు సంతకం కోసం భయం భయంతో తెస్తారు. అది చూసిన తరువాత ఎక్కువ ఉన్న తక్కువ ఉన్నా వారి మీద కోపం పడవద్దు. ఆ పిల్లలను ప్రేమతో దగ్గరకు తీసుకోవాలి. వారికి ఎందులో మార్కులు తక్కువ వచ్చినవి అని చూసుకోవాలి. ఏ సబ్జెక్టులో వీక్ ఉన్నాడో తెలిసిపోతుంది. టీచర్ చెప్పే పాఠం పిల్లలకు

అర్థమవుతుందా లేదా తెలుసుకొని సెపరేట్ ట్యూషన్ క్లాస్ పెట్టి వారికి చెపితే ఆ పిల్లలు కూడా మిగతా పిల్లలతో సమానంగా ముందుకు సాగిపోగలరు.

మీ పిల్లల్ని వేరే పిల్లలతో పోల్చవద్దు. వేరే పిల్లలతో పోల్చితే వారి ఆత్మ విశ్వాసం దెబ్బ తింటుంది. ఏ సబ్జెక్టులో ఎక్కువ మార్కులు వచ్చాయో చూసి దాని గురించి మాత్రమే పిల్లల్ని మంచిగా పొగడాలి. దీంతో పిల్లలు కష్టపడి చదవాలి నేను ఏదైనా సాధించాలనే తపన, ఆలోచన వారి మనసులో వస్తుంది. పిల్లలు ఏకాగ్రతగా, శ్రద్ధతో చదివేలా చూడాలి. చదివిన అంశాలను గుర్తుపెట్టుకునే విధానాన్ని తెలియజేయాలి.

సమయానుసారంగా పోషకాహారం అందించాలి. రాత్రి పూట త్వరగా నిద్రపోయే అలవాటు చెయ్యాలి. పిల్లలకు మార్కులు ఎక్కువగా రావాలి అనే దానికంటే సబ్జెక్టును అర్థం చేసుకుంటూ చదువుకునేలా ప్రోత్సహించాలి. మొక్కల పెరుగుదలకు నీరు ఎంత అవసరమో ప్రోత్సాహం, మద్దతు మనిషి అభివృద్ధికి అంతే అవసరం. అనుభవం నేర్పిన పాఠాలకు విలువ ఎక్కువ. ఆచరిస్తూ చెప్పే మాటలకు ఆదరణ ఎక్కువ.

నైతిక విలువలు, వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడలేని చదువుల వల్ల మానసిక ఆందోళన పెరుగుతుంది. పట్టభద్రులు అత్యధిక జీతాలు సాధిస్తున్నప్పటికీ తీవ్ర ఒత్తిళ్ళను ఎదుర్కోవాల్సి వస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఇటీవల పత్రికల్లో, ఏపీ రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఏడాది 8,398 ఆదర్శ ప్రాథమిక పాఠశాలలను ఏర్పాటు చేసింది. బరువు తగ్గిన పుస్తకాలు,పాఠ్యపుస్తకాలపై ఎలాంటి రాజకీయ నేతల చిత్రాలు లేకుండా ఆకర్షణీయంగా తీసుకొచ్చారు. పాఠ్య పుస్తకాలను సెమిస్టర్ల వారీగా ముద్రించారు. 3వ క్లాసు, 5వ క్లాసులకు గతంలో 12 పుస్తకాలు వుండగా ఇప్పుడు సెమిస్టర్‌లో నాలుగు పాఠ్య పుస్తకాలకు కుదించారు. 6వ క్లాసు, 9వ క్లాసు వరకు తెలుగు, ఆంగ్లం, హిందీ కలిపి ఒక్కటిగా ముద్రించారు. దీంతో పాఠ్య పుస్తకాల బరువు సైజు తగ్గిపోతుంది. రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి ఈ పాఠ్య పుస్తకాలను రూపొందించింది. రాజ్యాంగం విలువలు తెలిసేలా మన రాజ్యాంగ పుస్తకాలు విద్యార్థులకు అందిస్తున్నారు. ప్రపంచంలో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలంటే పాఠశాలలకే సాధ్యం. ఎందుకంటే అక్కడి నుంచే బాల్యం మొదలవుతుంది.

కొన్ని రాష్ట్రాలలో 60 శాతం పాఠశాలలు మూత పడిపోయాయి. సరైన సౌకర్యాలు లేక టీచర్స్ లేక మూతపడిపోయాయి. కొంతమంది పిల్లలు 2021-2024లో మూడు సంవత్సరాలలో దాదాపు 2 కోట్ల మంది పిల్లలు స్కూల్‌డ్రాప్ అయ్యారు. ఎక్కువ శాతం 1వ తరగతి నుండి 8వ తరగతి చదివే పిల్లలే స్కూల్ మానేశారు. పాఠశాలకు పోవడం లేదు, చదువు మానుకోవటానికి ఎన్నో కారణాలు ఉండవచ్చు. ఇలాంటి వారికి తల్లిదండ్రులు లేని అనాధ పిల్లలకు స్కూల్ మధ్యలో ఆపినవారికి పెద్ద చదువులకు ఫీజులు కట్టలేని వారి గురించి. డబ్బు ఉన్న దాతలు, కాలేజీ వాళ్ళు కలిసి వారికి మేము సహాయం చేస్తాము అనే వాళ్ళు లేకపోలేదు. ప్రపంచవ్యాప్తంగా అన్ని విద్యాలయాల్లో కలిపి సుమారు 90 నుంచి 100 కోట్ల మంది చదువుతున్నారు. ఒక్క భారత్‌లోనే 26 కోట్లు మంది విద్యాలయాల్లో చదువుతున్నారు.

తుది శ్వాస వరకు విద్యార్థులకు స్ఫూర్తి రగిలించిన మహనీయుడు అబ్దుల్ కలాం గారు భారతీయులకు అత్యంత గర్వకారణం. అబ్దుల్ కలాం శాస్త్రవేత్త, క్షిపణి పితామహుడు. తుదిశ్వాస వదిలే ముందు కూడా యువతను, విద్యార్థులను తన చైతన్యవంతమైన ప్రసంగాలతో ఆకట్టుకున్న అపార ప్రజ్ఞాశాలి. ఈ దేశానికి అబ్దుల్ కలాం లాంటి దార్శినికులు అవసరం.

ప్రవక్త విద్యాజ్ఞానాల ప్రాధాన్యతను నొక్కి చెప్పారు : "విద్యా సముపార్జన ప్రతి స్త్రీ పురుషులపై తప్పనిసరి విధి" అని.

తల్లిదండ్రులు తమ సంతానానికి బహూకరించే వాటన్నింటిలో శ్రేష్టమైన కానుక ఉత్తమమైన చదువు, సంస్కారాలే.

పత్రిక కాదిది, ఆత్మవేదన
క్రియాత్మక చేతన
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక




## జాతీయ రహదారులు రక్తసిక్తం

ప్రజలను గమ్యస్థానాలకు చేర్చాల్సిన రహదారులు రక్తసిక్తమవుతున్నాయి. రోడ్లపై నిత్యం పలువురు ప్రాణాలను కోల్పోతుండగా, మరికొందరు గాయపడి మంచాలకు పరిమితమవుతున్నారు. దేశంలోని జాతీయ రహదారులపై 2023లో దాదాపు 2,300 మంది మృత్యువాత పడ్డట్లు జాతీయ రహదారుల డేటా తెలుపుతోంది. 522 కిలోమీటర్ల పొడవు ఉన్న ఎన్‌హెచ్-48పై గుజరాత్లో 763 మంది మృతి చెందారు. ఆ ఏడాదిలో దేశంలో ఎక్కువమంది మృతిచెందింది గుజరాత్లోనే, 266 కిలోమీటర్ల ఎన్‌హెచ్-44పై హరియాణాలో 715మంది మృతి చెందారు. ఇక 154 కిలోమీటర్ల ఎన్‌హెచ్-65పై ఆంధ్రప్రదేశ్లో 213 మంది దుర్మరణం చెందారు. దేశంలోని పది జాతీయ రహదారుల్లో మృతిచెందిన వారి డేటా ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ మూడో స్థానంలో నిలిచింది. కేవలం 21 మంది మృతిచెందిన రాష్ట్రంగా పుదుచ్చేరి నిలిచింది. ప్రమాదాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం పలు అవగాహన కార్యక్రమాలు చేపడు తున్నప్పటికీ.. ఫలితం కనిపించడం లేదు. త్వరితగతిన గమ్యానికి చేరుకోవాలనే లక్ష్యంతో జాతీయ రహదారులపై వేగంగా ప్రయాణిస్తున్న కారణంగా ఈ ప్రమాదాలు జరుగుతున్నట్టు కేంద్రం గుర్తించింది.

## పెను సమస్యగా అధిక బరువు

భారత్‌లో స్థూలకాయం పెను సమస్యగా మారుతోంది. దేశవ్యాప్తంగా ప్రజలను అధిక బరువు, ఊబకాయం, పట్టిపీడిస్తు న్నాయని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్), నేషనల్ ఇన్స్టిట్యూట్ ఫర్ క్యాన్సర్ ప్రివెన్షన్ అండ్ రీసెర్చ్ (ఎన్సీఐసీపీఆర్) సంయుక్తంగా నిర్వహించిన ఒక అధ్యయనంలో వెల్లడైంది. ప్రతి ఐదు కుటుంబాల్లో ఒక కుటుంబంలోని వయోజనులంతా అధిక బరువుతో బాధపడుతున్నట్లు అధ్యయనంలో తేలింది. దాదాపు 20 శాతం కుటుంబాలకు అధిక బరువు సమస్యగా పరిణమించింది. 10 శాతం మంది స్థూలకాయంతో జీవితాన్ని నెట్టుకొస్తున్నారని అధ్యయనం నివేదించింది. మణిపూర్, కేరళ, అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం వంటి రాష్ట్రాల్లోని 30శాతం కంటే ఎక్కువ కుటుంబాల్లో దాదాపు పెద్దలందరూ అధిక బరువుతో ఉన్నారు. తమిళనాడు, పంజాబ్ రాష్ట్రాల్లో ప్రతి ఐదింట రెండు కుటుంబాల్లో పెద్దలు ఊబకాయంతో బాధపడుతున్నారు. ఇటీవల తమిళనాడు హెల్త్ జర్నల్‌లో సంబంధిత అధ్యయన వివరాలు ప్రచురితమయ్యాయి. దక్షిణాది రాష్ట్రాలు, పట్టణ ప్రాంతాల్లో అధిక బరువు, ఊబకాయం సమస్యల వివరాలను అధ్యయనం వెల్లడించింది. సంపన్న ప్రాంతాలలో ముఖ్యంగా షెడ్యూల్డ్ తెగ వర్గాలలో 12.2 శాతం వరకు ఊబకాయంతో బాధపడుతున్న వారి సంఖ్య ఎక్కువగా ఉందని అధ్యయనం పేర్కొంది. పట్టణ కుటుంబాల్లో దాదాపు 15 శాతం మంది ఊబకాయంతో బాధపడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ సంఖ్య 8 శాతంగా నమోదైంది. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక సహా దక్షిణ రాష్ట్రాలు స్థూలకాయానికి సంబంధించి హాట్ స్పాట్‌లుగా అవతరించాయి.

## 15రోజుల్లోగా ఓటర్ ఐడీ కార్డుల డెలివరీ

ఎలక్టర్ ఫొటో ఐడెంటిటీ కార్డు (ఎపిక్)ను ఓటర్లకు చేరవేసే విషయంలో ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. 15 రోజుల్లోగానే ఈ కార్డులు సంబంధిత ఓటర్లకు చేరేలా చర్యలు తీసుకోనున్నట్లు ఇటీవలె వెల్లడించింది. ప్రస్తుతం ఈ కార్డుల డెలివరీకి నెల రోజులకుపైగా సమయం పడుతోంది. ఇప్పుడు ఈ సమయం సగానికి తగ్గిపోనుంది. ఇందుకోసం నూతన ప్రామాణిక నియమావళిని ఎన్నికల సంఘం రూపొందించింది. కొత్తగా ఓటర్‌గా పేరు నమోదు చేసుకున్న తర్వాత లేదా ప్రస్తుతం ఉన్న కార్డులో మార్పులు చేర్పులు చేసుకున్న తర్వాత 15 రోజుల్లోగా నూతన ఫొటో గుర్తింపు కార్డు ఓటర్లకు అందనుంది.

## పాత వాహనాలకు పెట్రోల్, డీజిల్ బంద్

ఢిల్లీలో కాలుష్యాన్ని తగ్గించడానికి ప్రభుత్వం కొత్త నిబంధన తీసుకొచ్చింది. ఈ నిబంధన ప్రకారం పదేళ్లు దాటిన డీజిల్ వాహనాలకు, పదిహేనేళ్లు దాటిన పెట్రోల్ వాహనాలకు జూలై 1 నుంచి ఇంధనం పోయరు. ఇతర రాష్ట్రాల్లో రిజిష్టరై ఇక్కడ తిరిగే వాహనాలకు కూడా ఇది వర్తిస్తుందని ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ కమిషన్ (సీఏక్యూఎమ్) సభ్యుడు వీరేందర్ శర్మ తెలిపారు. ఈ కొత్త నిబంధనను అమలు చేయడానికి ఢిల్లీలోని దాదాపు అన్ని పెట్రోల్ బంకుల్లో ఇప్పటికే ఆటోమేటెడ్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్(ఏఎన్‌పీఆర్) కెమెరాలను అమర్చారు.




## భూమిపై నరకం గాజా

భూమిపై నరకం కంటే అధ్వానంగా గాజా ప్రాంతం తయారైందని ఇంటర్నేషనల్ కమిటీ ఆఫ్ ది రెడ్ క్రాస్ ప్రెసిడెంట్ మిర్జానా స్పోలైరిక్ వ్యాఖ్యానించారు. గాజాలో యుద్ధాన్ని ఆపేందుకు, పాలస్తీనా ఖైదీలను విడుదల చేసేందుకు, బందీలను వదిలి పెట్టేందుకు ప్రపంచ దేశాలు అవసరమైన ప్రయత్నాలు చేయడం లేదని ఆరోపించారు. అంతర్జాతీయ మానవతా చట్టాలను పట్టించుకోవడం లేదు. పాలస్తీనియన్లకు కనీస మానవీయమైన గౌరవాన్ని కూడా ఇవ్వడం లేదు. గాజాలో చట్టపరమైన, నైతిక, మానవీయ ప్రమాణాల ఉల్లంఘన జరుగుతోందని ఆమె పేర్కొన్నారు.

## గాజాలో మారణహోమం..

గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతుండటంతో మృతుల సంఖ్య పెరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం, ఈ ఘర్షణల్లో మరణించిన వారి సంఖ్య 56,000 మార్కును దాటింది. గాజాలోని పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఈ వివరాలను వెల్లడించింది. 2023 అక్టోబర్‌లో ఘర్షణలు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు గాజాలో మొత్తం 56,077 మంది ప్రాణాలు కోల్పోయారని ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. అంతేకాకుండా, ఈ దాడుల్లో 1,31,848 మంది పాలస్తీనియన్లు గాయపడ్డారని పేర్కొంది. పరిస్థితి తీవ్రతకు అద్దం పట్టేలా, ఇటీవలి కాలంలో మరణాల సంఖ్య గణనీయంగా పెరిగింది. కేవలం ఈ ఏడాది మార్చి 18 నుంచి ఇప్పటివరకు జరిగిన దాడుల్లోనే 5,759 మంది పాలస్తీనియన్లు మరణించారని, మరో 19,807 మంది గాయపడ్డారని మంత్రిత్వ శాఖ తన ప్రకటనలో వివరించింది. ముట్టడిలో ఉన్న గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ దాడులు నిరంతరాయంగా కొనసాగుతుండటంతో, ప్రాణనష్టం భారీగా ఉంటోంది.

## ఆసియా ఖండం వేడెక్కుతోంది

ప్రపంచ వాతావరణ సంస్థ 'స్టేట్ ఆఫ్ ది క్లైమెట్ ఇన్ ఆసియా 2024' నివేదికల ప్రకారం.. ఆసియా ఖండంలో సగటు ఉష్ణోగ్రతల కంటే 1.04 డిగ్రీలు ఎక్కువగా నమోదవుతున్నాయి. 1991-2020 బేస్‌లైన్‌తో పోలిస్తే 2024లో సగటు ఉష్ణోగ్రతలు 1.04 డిగ్రీల సెల్సియస్ పెరిగాయి. ఇది ప్రపంచ సగటు కన్నా దాదాపు రెండు రెట్లు ఎక్కువ. హిమాలయాలు, టియాన్ షాన్ పర్వతాల్లో హిమనీనదాలు వేగంగా కరుగుతుండటంతో మంచినీటి వనరులకు ముప్పు ఏర్పడే అవకాశం ఉంది. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు, సముద్ర మట్టాలు పెరగడం వల్ల తీరప్రాంతాల్లో వరదలు, తుఫానుల ప్రభావం ఎక్కువగా ఉండనుంది. ఇండియాలోని తీర ప్రాంతాల్లో కూడా దీని ప్రభావం కనిపించనుంది. 2024లో ఆసియా అత్యంత వేడిగల సంవత్సరాల్లో ఒకటిగా నమోదైంది. ఇండియా, జపాన్ వంటి దేశాల్లో తీవ్రమైన వేడి గాలులకు వందలాది మంది చనిపోయారు. వియత్నాంలో యాగి తుపాన్ వల్ల చాలా మంది మరణించారు. 2024 సెప్టెంబర్‌లో నేపాల్లో వరదల కారణంగా 246 మంది మరణించారు. గల్ఫ్ దేశమైన యూఏఈలో భారీ వర్షాలు కురవడం, ఎడారి ప్రాంతంలో వరదలు రావడం అందరినీ ఆశ్చర్యపరిచాయి ఈ నివేదిక ప్రకారం వాతావరణ మార్పును ఎదుర్కోవాలంటే ముందు జాగ్రత్త చర్యలు, విపత్తు సంసిద్ధత, వాతావరణ సేవల శక్తివంతమైన పాత్ర ఎంతో అవసరమని స్పష్టమవుతోంది. ముఖ్యంగా ఆసియాలో వాతావరణం వేగంగా వేడెక్కుతుండటంతో పర్యావరణ మార్పుల వల్ల కలిగే నష్టాన్ని తగ్గించడానికి ఆయా దేశాలు ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

## మహిళలూ భారత్‌కు ఒంటరిగా వెళ్లొద్దు

భారత్‌కు వెళ్లే అమెరికా పర్యాటకులు మరింత జాగ్రత్తగా ఉండాలంటూ ఆ దేశ విదేశాంగ శాఖ హెచ్చరిక జారీ చేసింది. లెవెల్-2 ట్రావెల్ వార్నింగ్ పేరుతో ఈ నెల 16న ఆకస్మిక ప్రకటన విడుదల చేసింది. నేరాలు, ఉగ్రవాదం పెరిగినందున కొన్ని ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించింది. "భారత్‌లో మానభంగాలు చాలా వేగంగా పెరుగుతున్న నేరంగా మారింది. కొన్ని పర్యాటక కేంద్రాల్లో హింసాత్మక నేరాలు, లైంగిక దాడులు జరుగుతున్నాయి" అని తెలిపింది. ఒంటరిగా ప్రయాణించకూడదని, మహిళలైతే అసలు ఒక్కరే వెళ్లకూడదని స్పష్టం చేసింది. భారత్‌లో పని చేసే అమెరికా ప్రభుత్వ ఉద్యోగులకు కూడా పలు సూచనలు చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో ఏవైనా సంఘటనలు జరిగితే అత్యవసర సేవలు అందించే వెసులుబాటు అమెరికా ప్రభుత్వానికి లేనందున, అక్కడికి వెళ్లకపోవడమే మంచిదని తెలిపింది. ఒకవేళ వెళ్లాలనుకుంటే ముందుగా అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొంది. అత్యంత అప్రమత్తంగా ఉండాల్సిన ప్రాంతాల జాబితాలో తూర్పు మహారాష్ట్ర, ఉత్తర తెలంగాణ, పశ్చిమ బెంగాల్ పశ్చిమ ప్రాంతాలను చేర్చింది. జమ్మూ-కశ్మీర్, పాక్ సరిహద్దు, మధ్య భారత్‌లోని కొన్ని ప్రాంతాలకు వెళ్లేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచించింది. బిహార్, ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్, మేఘాలయ, ఒడిశా రాజధానులకు వెళ్తే ఫరవా లేదని, గ్రామీణ ప్రాంతాలకు వద్దని పేర్కొంది.

# సత్కార్యంతోనే సాఫల్యం


**- అర్షియా**

**మనిషి సంఘ జీవి**. అందరితో సామరస్యంగా జీవిస్తూ, మంచి పనులు చేస్తుంటే అతడి జీవనం సాఫీగా సాగుతుంది. అందుకే 'మీ పరస్పర సంబంధాలను సంస్కరించుకోండి' (49: 10) అని అల్లాహ్ ఖుర్‌ఆన్‌లో సెలవిచ్చాడు. విశ్వాసులందరూ పరస్పరం సోదరులే అని ప్రవక్త(స) అన్నారు. ఇస్లాం ప్రకారం ప్రతి ముస్లిం ప్రతి రోజూ తప్పనిసరిగా సదఖా(దానం) చేయాలి. ఒకరి ప్రయాణంలో వారిని వాహనంపై కూర్చోబెట్టే చిన్న పని కూడా సదఖానే అవుతుంది. నమాజ్ కోసం మసీదు వైపు వేసే అడుగు కూడా సత్కార్యం కిందకే వస్తుంది. భార్యాభర్తల మధ్య కాని, సమాజంలో కొందరి మధ్య కాని సయోధ్య కుదర్చడమూ సత్కార్యమే! ఇక మనం ఎవరికైనా అప్పు ఇచ్చి ఉంటే బాకీదారుల పట్ల సౌమ్యంగా వ్యవహరించాలి. వారి పరిస్థితిని గమనించి అవసరమైతే అప్పు తీర్చడానికి వారికి మరికొంత గడువు ఇవ్వాలి. ఎవరైనా గొడవ పడుతుంటే వారి సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నించాలి. గొడవపడే వారు కూడా మధ్యవర్తులతో సహకరించి తమ సమస్యను పరిష్కరించుకోవాలి. ఇక మంచి విషయాల్లో తోటివారి కోసం సిఫారసు చేయడం పుణ్యకార్యమే. ప్రజల లోటుపాట్లను అందరి ముందు ప్రస్తావించి వారిని అవమానించకూడదు. వీలైతే వారి తప్పులను దాచి ఉంచి వ్యక్తిగతంగా వారికి మంచిని బోధించి సంస్క రించేందుకు ప్రయత్నించాలి. మనకు చేతనైతే తోటి ముస్లింల అవసరాలను తీర్చి వారికి సాయం చేయాలి. ఇలాంటి సాయాన్ని అల్లాహ్ శ్రేష్టమైన పుణ్యకార్యంగా పరిగణిస్తాడు. సమాజం చాలా మంది అల్పులుగా భావించే పేద ముస్లింలు, బలహీనులు ధనవంతుల కన్నా ఎక్కువ భక్తి, విశ్వాసాలు కలిగి స్వర్గ వాసానికి ఎక్కువ అర్హత కలిగి ఉంటారు. కాబట్టి ధనవంతులు, ఆడంబర పరులకు దాసోహం కాకుండా మంచివాళ్ల అడుగుజాడల్లో నడిస్తేనే మన జీవితానికి సాఫల్యం ఉంటుంది.

**పాపం పండాక అల్లాహ్ వదలి పెట్టడు..**

దుర్మార్గులకు ముస్లింలు సాయం చేయకూడదు. ఇతరులు దౌర్జన్యాలకు పాల్పడుతుంటే అడ్డుకోవడం ముస్లిం లందరి బాధ్యత. ఎవరైనా ఇహలోకంలో కొంచెం దౌర్జన్యానికి పాల్పడినా.. పర లోకంలో అది పెద్ద శిక్షకు కారణమవుతుంది. దౌర్జన్యకారుల పాపం పండిన తర్వాత అల్లాహ్ వారిని శిక్షించ కుండా వదలి పెట్టడు. దేవుడి ఖజానాను (ప్రజా ధనాన్ని) అక్రమంగా ఖర్చు పెట్టినవారు ప్రళయ దినాన నరకాగ్నిలో పడి హాహాకారాలు చేయాల్సి ఉంటుంది. పిసినారితనం దుర్మార్గ పనుల్లో ముఖ్యమైనది. మితిమీరిన ధన వ్యామోహంతో ఉన్నవాడు లేనివాడిని దోచుకుంటున్నాడు. అయితే అలాంటి బలహీనులకు దైవం అండగా నిలుస్తాడని దైవ ప్రవక్త(సల్లం) భరోసా ఇచ్చారు. వారికి జరిగిన నష్టాన్ని దైవం తిరిగి చెల్లింప చేస్తాడని తెలిపారు. 'ప్రళయ దినాన ఆఖరికి కొమ్ములేని మేకకు కూడా కొమ్ములున్న మేక నుంచి పరిహారం ఇప్పించ బడుతుంది' అని దైవప్రవక్త(సల్లం) ప్రవచించారు. ముస్లిములు తమ తోటి ముస్లింల ధన, మాన ప్రాణాలను పరిరక్షించాలని ఆదేశించారు ప్రవక్త (స). తన నోటితో కాని, చేత్తో కాని ఇతరులకు బాధ కలగకుండా మసలు కొనేవాడే నిజమైన ముస్లిం అని ప్రవచించారు.. ఇతరుల హక్కులు లాక్కున్నవారికి నరకాగ్ని తప్పనిసరి అని స్పష్టం చేశారు.

**తుదిగీటు**




Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**